Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 19.08.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 5


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ● చంద్రుడి పాలనలో...

# చీకట్లో రాష్ట్రం



- పెరుగుతున్న దుబారా
- ప్రజామోదం పొందే పథకాలు లేవు
- ఖజానాను గుల్ల చేస్తున్నారు
- పడిపోయిన చంద్రబాబు గ్రాఫ్

పరిపాలకుడి విధానాలు ప్రజల్లో ఆశలు రేకెత్తించాలి. భవిష్యత్‌పై భరోసా కల్పించాలి. భద్రతపై నమ్మకమివ్వాలి. ఏపి ప్రజలకు ఆ విధమైన భద్రత కల్పించడంలో, భవిష్యత్ పై భరోసానివ్వడంలో చంద్రబాబు నాయుడు విఫలమవుతున్నాడు. తెలుగుదేశం ప్రభుత్వంలో వున్నోళ్లకు, పార్టీలో ముఖ్యస్థానాల్లో వున్నవారికి తప్పితే, సామాన్య ప్రజానీకానికి తమ పురోభివృద్ధిపై ఏ మాత్రం నమ్మకం కలగడం లేదు.

విభజన తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఆర్థికంగా నష్టపోయింది. హైదరాబాద్ రూపంలో విలువైన ఆస్తులను వదులుకున్నాం. విభజన తర్వాత చంద్రబాబు ఏపికి తొలిముఖ్యమంత్రి అయ్యాడు. కుర్చీ ఎక్కింది మొదలుకొని రాష్ట్రం అప్పుల్లో వుంది. కుర్చీల్లేవ్, బల్లలు లేవ్, రాసుకోవడానికి పెన్నుల్లేవ్ అంటూ సణుగుడు మొదలుపెట్టాడు. ఆర్థిక ఇబ్బందుల్లో వున్నామని చెప్పి ఆయనేమన్నా పొదుపు చర్యలు పాటించాడా అంటే అదీ లేదు. హైదరాబాద్‌లో వదిలేసి వచ్చే సెక్రటేరియట్ భవనాల మరమ్మత్తుల కోసమే కోట్లు తగలేసాడు. ఇక వివిధ రూపాలలో జరిగిన దుబారా సంగతైతే చెప్పనవసరం లేదు.

కష్టకాలంలో ఏపి సీఎంగా రాష్ట్ర అభివృద్ధికి ఏమేం పనులు చేయాలో అవి మాత్రమే ఆయన చేయలేదు. ఏమేం చేయకూడదో అవే చేస్తున్నాడు. దుబారా తగ్గించాలి. అవినీతిని తగ్గించాలి. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టాలి. ప్రత్యేకహోదా కోసం కేంద్రంతో కయ్యానికైనా దిగాలి. విభజన చట్టంలో వున్న పోలవరం ప్రాజెక్ట్‌ను కేంద్రంతో పూర్తి చేయించుకోవాలి. వెనుకబడిన ప్రాంతంలో రాజధానిని అభివృద్ధి చేయాలి. ఇక ప్రజలకు పనికొచ్చే సంక్షేమ పథకాలను అమలు చేయాలి. చంద్రబాబు పాలనలో ఇవేమీ జరగడం లేదు. రాష్ట్రంలోని 13జిల్లాల్లో 10జిల్లాల్లో వ్యవసాయ పరంగా, ఖనిజాల పరంగా అభివృద్ధి చెందినవి కాబట్టి సరిపోయింది. ఆ జిల్లాల నుండి అందుతున్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ జిల్లాలు కూడా తెలంగాణ జిల్లాలు మాదిరిగా ఉంటే ఈ వరకే జనాలు చిప్పలు చేతుల్లో పట్టుకోవాల్సి వచ్చేది.

చంద్రబాబు పరిపాలనా విధానాలు సొంత పార్టీ వాళ్లకూ నచ్చడం లేదు. ఈ పనిని చూసి చంద్రబాబుకు ఓటెయ్యాలన్న పరిస్థితి లేదు. వై.యస్. సిఎంగా చేసింది ఐదేళ్లే! ఆ కాలంలోనే ఆయన సొంత బ్రాండ్‌ను సృష్టించాడు. ఒక్కో వర్గం వాళ్లు ఒక్కో పథకాన్ని చూసి వై.యస్. పట్ల ఆకర్షితులయ్యారు. వై.యస్. హయాంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్, పింఛన్‌లు ప్రజలపై ప్రత్యేక ముద్రను వేశాయి. అప్పట్లో కాంగ్రెస్‌కు అవే పెద్ద ఓటు బ్యాంకుగా మారాయి. ఇంత చేసినా కూడా, ఇంత బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకున్నా కూడా 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయి.

(మిగతా 11వ పేజీలో)




## ఏర్పాట్లు ఘనం

# తగ్గిన జనం

పుష్కరాలంటే ఇవి కదా... పుష్కరాలను చేయాల్సింది ఇలా కదా... పుష్కరాలను చేయాలంటే చంద్రబాబుకు క్రిందే... ఇక ఏ రాష్ట్రంలో పుష్కరాలు, కుంభమేళాలు జరిగినా ఆ ఈవెంట్‌లను చంద్రబాబుకు అప్పగిస్తే చాలు... నభూతో నభవిష్యత్ అన్నట్లు నిర్వహించేస్తాడు... కాకపోతే చిన్న ఇబ్బంది ఒక్కటే!

(మిగతా 11వ పేజీలో)


నెల్లూరు వచ్చిన కాంచిపురం
కంచి పట్టు చీరలు
వీవర్స్ ధరలకే
800 మాస్టర్ డిజైనర్స్‌తో
50.000 డిజైన్లలో మా సొంత మగ్గాలపై నేసిన
ప్యూర్ కంచి పట్టు చీరలు రూ॥ 695 నుండి లభ్యం,
నెల్లూరులో అత్యంత తక్కువ ధరలు, విచ్చేయండి
ధరల తేడా గమనించండి.. ఇంకెందుకు ఆలస్యం...
KANCHEEPURAM
VRK
SILKS
#27B/76, నాడు స్ట్రీట్, షేక్‌పేట్,
కాంచిపురం. Ph: 0442 7222226
Ground, 1st Floor, WOMAN'S WORLD
కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా, దర్గామిట్టా,
జి.ఎన్.టి.రోడ్, నెల్లూరు. ఫోన్: 2316667
పెళ్ళిళ్ళకు, ఇండ్ల దగ్గర అమ్మే వస్త్ర వ్యాపారులకు అద్భుత అవకాశం



## ఆనం చేతికి...

# నెల్లూరు 'దేశం'?

జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకత్వం మార్పుకు సంకేతాలు వస్తున్నాయి. ఈ ఏడాదే పార్టీలో చేరిన మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చునని తెలుస్తోంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా వున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆ పదవి నుండి తప్పుకోవాలనుకుంటున్నాడు. అదే సమయంలో 'రెడ్ల' ప్రాబల్యమున్న ఈ జిల్లాలో ఆ వర్గానికి చెందిన వారినే అధ్యక్షుడిగా పెట్టాలని చంద్రబాబు ఆలోచిస్తున్నాడు. గతంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పదేళ్ల పాటూ జిల్లా అధ్యక్ష బాధ్యతలను మోసారు. ఆయన ఇక తన వల్ల కాదన్న తర్వాతే జిల్లా పార్టీ బాధ్యతలను బీద రవిచంద్రకు అప్ప గించారు. జిల్లానంతా కంట్రోల్ చేయగల నాయకుడు

(మిగతా 11వ పేజీలో)

# బోర్లు మింగుతున్నా.. బుద్ధి రాదా?



"బోరు బావిలో పడి బాలుడి మృతి", "బోరు బావిలో చిన్నారి"... గత కొన్నేళ్లుగా ఇలాంటి వార్తలు ఎన్ని చదవడం లేదు, ఎన్ని వినడం లేదు. అయినా మనం బుద్ధి తెచ్చుకోవడం లేదు. బోర్లు వేసిన వెంటనే వాటికి పైకప్పులు బిగించకుండా వదిలేస్తున్నాం, మన నిర్లక్ష్యానికి మన బిడ్డలే బలవుతున్నారు. ఇటీవల కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాలెం పంచాయితీ పరిధిలోని నందెమ్మపురంలో జరిగిందిదే! ఈ గ్రామంలో గోపి, తిరుపతమ్మల మొదటి కుమార్తె మౌనిక ఆ ఇంట్లోనే నీటి కోసం తవ్విన 25 అడుగుల లోతు బోరుబావిలో పడి మరణించింది. చెన్నైలో వుంటున్న తిరుపతమ్మ రెండోకాన్పు కోసం తల్లిదండ్రుల వూరైన నందెమ్మపురంకు వచ్చింది. ఇంట్లో నీళ్ల కోసం 25అడుగుల లోతులో బోరు వేసి, దానికి పైన మూత బిగించలేదు. మౌనిక ఆడుకుంటూ వచ్చి అందులో పడిపోయింది. అధికారులు, పోలీసు సిబ్బంది హుటాహుటిన వచ్చి బోరు సమాంతరంగా ప్రొక్లెయిన్ లతో గుంత తవ్వి బాలికను వెలికి తీశారు. అయితే అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో తల్లిదండ్రుల గుండెలు పగిలాయి.

బోరు బావులు తవ్వాక వాటికి మూతలు పెట్టడం ప్రతి ఒక్కరు చేయాల్సిన పని. మన నిర్లక్ష్యానికి పసిబిడ్డలు బలి కావడం ఎంతవరకు న్యాయమో ఆలోచించండి.

# విమానం ఆశలకు రెక్కలు

జిల్లా ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎయిర్‌పోర్టు ఆశలకు రెక్కలు తొడిగారు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు. దగదర్తి మండలంలోని దామవరం వద్ద త్వరలోనే విమానాశ్రయం నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ బుధవారం కావలిలో ప్రకటించారు. దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇంతవరకు 1400 ఎకరాల భూమిని సేకరించారు. ఈ భూములకు సంబంధించిన పరిహారం పంపిణీపై కూడా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించారు.

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడే దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆమోదం లభించింది. అయితే ఆయన తర్వాత సీఎంలు రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు దీనిపై దృష్టి పెట్టలేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో తిరిగి దీనిపై కదలిక వచ్చింది. ఏపిలోని అన్ని జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు, రన్‌వేలు పెట్టాలని చంద్రబాబు భావిస్తున్నారు. విమానాల ద్వారా దేశంలోని వివిధ నగరాలకు లేదా విదేశాలకు పోవాలంటే నెల్లూరీయులు ఎక్కువగా చెన్నై, తిరుపతి, హైదరాబాద్ ఎయిర్‌పోర్టులకు పోవాల్సి వస్తోంది. హైదరాబాద్, ముంబై, ఢిల్లీలకు నెల్లూరుజిల్లా నుండి రాజకీయ నాయకులు గాని, వ్యాపారులు గాని పెద్ద సంఖ్యలోనే వెళుతుంటారు. దామవరం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నైలకు వెళ్లే పని తగ్గుతుంది.

# ఏపియుడబ్ల్యూజే ఆవిర్భావ దిన వేడుకలు



ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 1957లో ఐజేయూకు అనుబంధంగా ఏపియుడబ్ల్యూజే ఏర్పడిందని ప్రస్తుతం ఏపిలో 10వేలమంది జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జి రాజన్, సంపత్‌కుమార్, రామ్మూర్తి తదితర సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు.

# వాతావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## జేసీ ఇంతియాజ్



వాతావరణ పరిరక్షణ జరగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఆదివారం మనుబోలు మండలం జట్లకొండూరు గ్రామంలో జేసి వనం-మనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల వల్ల ప్రకృతిలో ప్రాణవాయువు పెరుగుతుందని, అందువల్ల ప్రతిఒక్కరూ మొక్కలునాటాలని కోరారు.

సింహపురి సమాచారం

## కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి

# పూర్వకళ తెస్తాం...

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభానికి కృషి చేస్తామని రైతులకు ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర హామీ ఇచ్చారు. మంగళవారం కొడవలూరు మండలం కొత్తవంగల్లులో రూ.16లక్షలతో నిర్మించిన పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. సంగం, పెన్నా బ్యారేజీల పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కడప ఎమ్మెల్సీ సి.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో కొత్త వంగల్లు పంచాయితీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. ఆయన్ను కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డిస్ట్రిబ్యూటరి కమిటి ఛైర్మెన్ చక్కా మదన్ మోహన్, సర్పంచ్ నారయ్య పాల్గొన్నారు.

# అవార్డులకు దరఖాస్తులు

భారత ప్రభుత్వం ప్రతి ఏటా స్వచ్ఛంధంగా జాతీయ అభివృద్ధి మరియు సామాజిక సేవారంగాలలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు మరియు సేవా సంస్థలకు జాతీయ అవార్డులు అందజేస్తుంటుంది. 2015-16 సంవత్సరానికి జాతీయ అవార్డులు పొందగోరే వారు ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సెట్నల్ సిఇఓ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను www.yas.nic.in అనే వెబ్‌సైట్ నుండి పొందవచ్చుని, మరిన్ని వివరాలకు జిల్లా యువజన సంక్షేమ కార్యాలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఏ.సి.నగర్, నెల్లూరు. ఫోన్. 9849913074 నెంబర్‌లో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

● 'లాయర్'కు ప్రత్యేకం

# మన స్వాతంత్ర్యవీరులు

**ఉద్యమాల పురిటిగడ్డ, పోరాటాల పుట్టినిల్లు మన నెల్లూరు. మొలగొలుకులు మొలచిన జిల్లాగా, మొనగాళ్లకు నెలవైన ఖిల్లాగా ప్రసిద్ధి మన నెల్లూరుజిల్లా. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటీష్ ముష్కరులపై తిరుగుబాటు చేసి జైళ్ళపాలైన ఎందరో పోరాటవీరులు మన జిల్లాలో వున్నారు. ఆనాటి సమరంలో పాల్గొన్న ధీరోదాత్తుల వివరాలను పొందుపరుస్తూ గతంలో "హూస్ హూ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అన్న పేర రాష్ట్రంలో స్వాతంత్ర సమరోద్యమంలో పాల్గొన్న వేలాది మందికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ సమగ్ర గ్రంథాన్ని మూడు సంపుటాలుగా ముద్రించింది. వాటిలో మూడవ సంపుటిలో నెల్లూరుజిల్లాకి సంబంధించిన దాదాపు 400మందికి పైగా సమరవీరుల ప్రాథమిక సమాచారాన్ని 'లాయర్' సేకరించగలిగింది. ఈ వారం నుండి వారి పేరు, ఊరు వివరాలను 4వారాల పాటు 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.**

**గమనిక :** ఈ మహనీయులకు సంబంధించిన వారి కుటుంబసభ్యులు కాని, లేదా వారి వారసులు గాని... తమ వద్ద క్రింది వారికి సంబంధించిన సమాచారం కాని, వారి ఫోటోలు గాని వుంటే మాకు పంపగలరని మనవి. వీరందరికి సంబంధించిన సమాచారాన్ని సాధ్యమైన వరకు సేకరించి పాఠకులకు, రేపటి తరానికి అందించాలని సాహసిస్తోంది 'లాయర్'. ఆదరించండి, ఆశీర్వదించండి. మీకు తెలిసిన వివరాలను వెంటనే మాకు నేరుగా గాని, లేక ఇ-మెయిల్ roopagroup@yahoo.com ద్వారా గాని పంపవలసినదిగా విజ్ఞప్తి.

మన జిల్లాలోని స్వాతంత్ర్యసమరయోధుల పేరు, ఇంటిపేరు, వూరు, వారి స్వస్థలాలను సూచిస్తూ అప్పటి పాత తాలూకాల్లోని ఆయా వూర్లపేర్లతో అకారాది క్రమం(ఆల్ఫాబెటికల్ ఆర్డర్)లో రూపొందించిన జాబితా ఇది. గమనించగలరు.

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 1 | ఆదెప్పరెడ్డి చిట్టమూరు | మడమనూరు-నెల్లూరు తాలూకా |
| 2 | ఆదెప్పరెడ్డి పూండ్ల | యల్లాయపాళెం-కోవూరు తాలూకా |
| 3 | ఆదినారాయణరెడ్డి సోమిరెడ్డి | ఆల్లీపురం-నెల్లూరు తాలూకా |
| 4 | ఆదినారాయణయ్య సూరి | వవ్వేరు-కోవూరు తాలూకా |
| 5 | ఆదిశేషారెడ్డి బెజవాడ | ఊటుకూరు-కోవూరు తాలూకా |
| 6 | ఆదిశేషారెడ్డి ఉచ్చూరు | అల్లూరు-కోవూరు తాలూకా |
| 7 | ఆదిశేషయ్య గడ్డం | నెల్లూరు |
| 8 | ఆదిశేషయ్య రావి | అల్లూరు-కోవూరు తాలూకా |
| 9 | అనంతాచార్యులు ఉదయగిరి | గోగులపల్లి-కోవూరు తాలూకా |
| 10 | అనంతపద్మనాభయ్య తూములూరు | గండవరం కోవూరు తాలూకా |
| 11 | అనంతరామ అయ్యంగార్ చక్రవర్తుల | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 12 | ఆంథోని దామవరపు | నెల్లూరు |
| 13 | అవ్వలరాజు కొండూరు | రోసనూరు సూళ్ళూరుపేట తాలూకా |
| 14 | అయ్యపరెడ్డి వేమిరెడ్డి | కావలి తాలూకా |
| 15 | బాలగురునాథం చీళ్ళ | వెంకటగిరి |
| 16 | బాలకృష్ణారెడ్డి ఆళ్ళ | పంచేడు కోవూరు తాలూకా |
| 17 | బాలకృష్ణారెడ్డి గణపం | వింజమూరు ఉదయగిరి తాలూకా |
| 18 | బలరామిరెడ్డి దువ్వూరి | మైపాడు నెల్లూరు తాలూకా |
| 19 | బలరామిరెడ్డి నిడుముసలి | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 20 | బాలసరస్వతమ్మ పాటూరు | నెల్లూరు |
| 21 | బాలసుబ్రహ్మణ్యం మతిక | వేగూరు కోవూరు తాలూకా |
| 22 | బాలిరెడ్డి పట్నం | మైపాడు నెల్లూరు తాలూకా |
| 23 | భద్రయ్య పి | కోవూరు |
| 24 | బుసికొండయ్య చక్కా | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 25 | బుచ్చిబాబు | వెంకటగిరి |
| 26 | బుచ్చిరామయ్య దువ్వూరు | చుంచులూరు ఉదయగిరి తాలూకా |
| 27 | చంద్రారెడ్డి కొండా | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 28 | చంద్రారెడ్డి నలగట్ల | అల్లూరు కోవూరు తాలూకా |
| 29 | చంద్రశేఖరరెడ్డి బెజవాడ | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 30 | చంద్రశేఖరరెడ్డి పర్వతరెడ్డి | అల్లూరు కోవూరు తాలూకా |
| 31 | చంగల్రాయనాయుడు వరత్తూరు | సూళ్ళూరుపేట |
| 32 | చంగల్వరాయనాయుడు పెనుగోటి | వెంకటగిరి |
| 33 | చంగారెడ్డి పుదూరు | వెంకటగిరి |
| 34 | చాయప్ప వడియార | బొడ్డువారిపాళెం కోవూరు తాలూకా |
| 35 | చంచయ్య ఇస్కా | రాపూరు |
| 36 | చెంచయ్య కత్తి | వెంకటగిరి |
| 37 | చెంచయ్య ముంజులూరు | వెంకటగిరి |
| 38 | చెంచయ్య వెల్లంకి | కావలి తాలూకా |
| 39 | చెంచోబులు అనిబోయిన | వెంకటగిరి |
| 40 | చెంచుకృష్ణయ్య అప్పకాయల | వెంకటగిరి |
| 41 | చెంచులక్ష్మమ్మ వేనాటి | వరకవిపూడి నెల్లూరు తాలూకా |
| 42 | చెంచురాఘవులుచెట్టి ఎం | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 43 | చెంచురామయ్య అడ్డాల | మడమనూరు నెల్లూరు తాలూకా |

(మిగతా 11వ పేజీలో)

# పేదవారి కోసం...
# ఉచిత విద్యే కాదు.. ఉన్నత విద్యా మా లక్ష్యం..!

## - విపిఆర్ విద్యలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం ప్రాంగణంలో 70వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని జెండా వందన కార్యక్రమం నిర్వహించారు.

సంస్థల గౌరవ సిఇఓ ప్రొఫెసర్ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సంబరంలో విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నాడు. ఈ సందర్భంగా జెండా వందనం చేసిన అనంతరం విపిఆర్ మాట్లాడుతూ ఇంతమంది అర్హులైన పేద చిన్నారులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే కాకుండా ఈరోజు వారందరి సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను జరుపుకోవడం తనకు చాలా సంతోషంగా వుందని అన్నాడు. మేధస్సు కలిగిన పేద చిన్నారులకు బంగారు భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా తాను ప్రారంభించిన విపిఆర్ విద్య ఈరోజు జిల్లాలో ఎంతోమందికి స్ఫూర్తిదాయకం కావడం శుభపరిణామం అని, సహృదయులైన నెల్లూరీయులు ఎంతోమంది తన ఆలోచనను తామూ ఆదరిస్తామని ముందుకు రావడం తనకు చాలా ఆనందంగా వుందని ప్రభాకర్‌రెడ్డి అన్నాడు.



పదవ తరగతి తమ వద్దే పాసైన వారు తాము త్వరలో ప్రారంభించబోయే వృత్తి విద్యాకోర్సుల్లో సైతం తమ వద్ద శిక్షణ పొందవచ్చుని, కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందం చేసుకుని వృత్తి విద్య కోర్సులను అందుబాటులోకి తేవడానికి విపిఆర్ ఫౌండేషన్ కృషి చేస్తోందని అన్నారు. అర్హులైన పేదవారికి మంచి విద్య, మంచి వైద్యం అందించాలన్నది తన తపన అని, ఇన్నాళ్లకు ఆ మహత్కార్యానికి కార్యరూపం ఇచ్చే అవకాశం కలిగిందని అన్నారు.

సంస్థ గౌరవ సిఇఓ ప్రొఫెసర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఒక మహోన్నత ఆశయంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు ప్రారంభించిన విపిఆర్ ఫౌండేషన్ ద్వారా విద్యా రంగంలోని అన్ని విభాగాలను అందుబాటులోకి తెచ్చి సమగ్ర విద్యా ప్రాంగణంగా విపిఆర్ విద్యను తీర్చిదిద్దాలన్నదే ధ్యేయంగా సంస్థ ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి గార్లు చేపట్టే అన్ని సేవా కార్యక్రమాలకు విపిఆర్ ఫౌండేషన్ వేదికగా వుండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని అన్నారు. ప్రభాకర్‌రెడ్డి గారి లాంటి విద్యాదాత మంచిమనసున్న సేవాతత్పరుడు ఈ జిల్లాలో పుట్టడం నెల్లూరీయులు చేసుకున్న అదృష్టమని అన్నారు.

ఈ వేడుకలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర బృందంతో పాటు విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విపిఆర్ వైద్యం నిర్వాహణా సారథి డా॥ రాజ మన్నార్, విపిఆర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.









# ఉత్తమ పనికి ఉత్తమ ప్రశంస



పనితీరులో వేగం, తన శాఖ పనిలో పురోగతిని చూపించినందుకు గాను నెల్లూరు, ప్రకాశం జిల్లాల కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డి మున్సిపల్ మంత్రి పి.నారాయణ చేతులమీదుగా ఉత్తమ సేవాపత్రం అందుకున్నారు. ఈ నెల 15న నెల్లూరు, పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ఈ అవార్డు తీసుకున్నారు. వాణిజ్య పన్నుల వసూళ్లలో ఆయన నెల్లూరు డివిజన్‌ను ముందు నిలిపారు. అంతేకాక పన్ను చెల్లింపుదారులతో ఎంతో స్నేహంగా వ్యవహరిస్తూ, పన్నులపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ తమ సంస్థ ఆదాయం పెంపుకు కృషి చేశారు. ఆయన కృషి ఫలితమే ఈ ప్రశంస. వెల్‌డన్ కృష్ణమోహన్!

# విజయసారథికి
## ఇస్రో ప్రతిభా పురస్కారం



సతీష్‌ధావన్ రోదసీ కేంద్రం(షార్) ఎంఎస్‌ఎ గ్రూపు డైరెక్టర్ పరుచూరి విజయ సారథి ఇస్రో ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారని బెంగుళూరు ఇస్రో కేంద్ర కార్యాలయం ప్రకటించింది. విజయసారథి గత 37 ఏళ్లుగా షార్ లోని వివిధ విభాగాల్లో పని చేశారు. వివిధ కమిటీల్లో పనిచేసిన అనుభవం వుంది. ఆయన పనితీరు, అంకితభావంను దృష్టిలో వుంచుకుని ఇస్రో ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది.

# ఆంధ్రాను.. ఆదుకోండి!
## - ప్రధానిని కోరిన టిఎస్సార్



రాష్ట్ర విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు, నెల్లూరీయుడు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ వ్రాసారు. 2014 ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పొందుపరచిన హామీలన్నింటిని అమలు చేయాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 9జిల్లాల ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందించే పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించి, ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకబోర్డును నియమించాలి. ప్రతి బడ్జెట్‌లోనూ పోలవరం ప్రాజెక్ట్‌కు 4వేల నుండి 5వేల కోట్ల వరకు నిధులు కేటాయించాలి. ఏపి ఆర్థిక లోటును కేంద్రప్రభుత్వమే భర్తీ చేయాలి. ఏపిలోని వెనుబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ప్రకటించాలి. ఏపి అభివృద్ధికి స్పెషల్ గ్రాంట్స్ మంజూరు చేయాలి. అమరావతి రాజధాని నిర్మాణానికి తగినన్ని నిధులు మంజూరు చేయడంతో పాటు హైకోర్టు, సెక్రటేరియట్‌లను కేంద్రప్రభుత్వమే నిర్మించాలని ఆయన ఆ లేఖలో ప్రధానిని కోరారు.

# ఏపి పట్టణ పేదరిక నిర్మూలన ఇసి మెంబర్‌గా వసంత లక్ష్మి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పట్టణ పేదరిక నిర్మూలన, జీవనోపాదుల ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్‌గా వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసర్చి సెంటర్ అధినేత్రి, హైకోర్టు న్యాయవాది అయిన డా॥ టి.వసంత లక్ష్మిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం నెల్లూరు పొగతోటలోని వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వసంతలక్ష్మి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కష్టాలు కన్నీళ్లలో వున్న అర్హులైన మహిళలు, పిల్లలు, వృద్ధులు,



వికలాంగులను అక్కున చేర్చుకుని నిర్భాగ్యులైన వారి జీవితాల్లో ట్రస్టు ద్వారా మంచి భవిష్యత్తును అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మంత్రి నారాయణ సహకారంతో గౌరవ ముఖ్యమంత్రి ద్వారా తనను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించడం ఆనందంగా వుందన్నారు.

సమాజంలో ప్రజలందరి సహాయ సహకారాలతో, జిల్లా అధికారుల సమన్వయంతో పేద, బడుగు వర్గాల యువత, మహిళల జీవనోపాదులు పెంచే విధంగా, వారి పేదరికాన్ని జయించే రీతిలో ప్రభుత్వ పథకాలను అమలయ్యే విధంగా చూస్తానని, తద్వారా సమాజంలో పేదరిక నిర్మూలనకు తనవంతు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



## 'ప్రభా'తం

# కాశ్మీర్‌పై ధీటైన మాట

**పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకే) కూడా మన జమ్మూ కశ్మీర్‌లో అంతర్భాగమేనని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేయడం..సరైన సమయంలో ధీటైన మాటే. గత కొద్దిరోజులుగా కల్లోలభరితంగా వున్న కశ్మీర్ ప్రజలకు ప్రధాని మాటలు భరోసానిచ్చేవే. బెలూచిస్తాన్‌లో, పాకిస్తాన్ అక్రమఆధీనంలో వున్న జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రాంతాల్లో పాక్ అకృత్యాలను బయటపెట్టి, దౌత్య పరంగా వాటికి అడ్డుకట్టవేసేందుకు ఇటీవల అఖిలపక్ష సమావేశం నిర్ణయించడం ఒక శుభపరిణామంగానే భావించవచ్చు.**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకే) కూడా మన జమ్మూ కశ్మీర్‌లో అంతర్భాగమేనని ప్రధాని నరేంద్రమోడీ సరైన సమయంలో ధీటైన మాట చెప్పారు. దీంతో, కశ్మీర్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా ఆనందం వ్యక్తమవుతోంది. ఆ ఒక్కమాటే కాదు, బలూచిస్తాన్‌లో, పాకిస్తాన్ అక్రమ ఆధీనంలో వున్న జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రాంతాల్లో పొరుగుదేశం అకృత్యాలను బయటపెట్టాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందుకు సంబంధించి దౌత్యపరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని ప్రధాని స్పష్టం చేయడం ఒక శుభ పరిణామంగా అందరూ భావిస్తున్నారు. కశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి, ఆందోళనలు అన్నీ పాక్ మద్దతుతో జరుగుతున్న సీమాంతర ఉగ్రవాద ఫలితమేనని కుండబద్దలు కొట్టినట్లు ప్రధాని స్పష్టంగా పేర్కొనడం ప్రధాని మోడీ నిజాయితీకి..నిర్మొగమాట తత్వానికి ఇదొక నిదర్శనం. అంతేకాదు, జాతీయ భద్రత, దేశ సమగ్రతకు సంబంధించి రాజీపడే ప్రసక్తే లేదని ప్రధాని తన విధానాన్ని స్పష్టం చేయడం ఆయన ధీశక్తిని..దేశభక్తిని చాటుతోంది. గత కొద్దిరోజులుగా కల్లోలభరితంగా వున్న కశ్మీర్ ప్రజలకు అండదండగా ఆయన చెప్పిన మాటలు కశ్మీరీ ప్రజలకు పెద్ద భరోసానిచ్చేవే. ఎందుకంటే, ఉగ్రవాద విషసర్పం క్రమక్రమంగా ప్రపంచం కాళ్ళకు చుట్టుకుని, అన్నిదేశాలకూ పాకుతూ అంతటా విషం చిమ్మేందుకు బుసలు కొడుతోంది. మానవత్వాన్ని సమూలంగా నాశనం చేసి, దానవత్వమే రాజ్యమేలాలనే భయంకర ఉన్మాదతత్వంతో అనేక దేశాల్లో నిత్యం దారుణ మారణకాండలు సృష్టిస్తూ వీరంగం చేస్తోంది.

ఈ ఉగ్రవాద రక్కసి కోరలకు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది బలైపోయారు. నిత్యం ఎక్కడో ఒక చోట చిచ్చుపెట్టి ప్రజల ప్రాణాలను మట్టుపెట్టేందుకే చూస్తుంటుందీ ఉగ్రవాద రక్కసి. స్వతంత్రం కోసం పోరాటం చేస్తున్నామని పచ్చి అబద్దాలు చెప్తూ.. అమాయక ప్రజలను విషప్రచారాలతో మోసం చేస్తూ, నమ్మినవారిని తమ బుట్టలో వేసుకుని, వారిని కూడా ఉగ్రవాదులుగా మానవబాంబులుగా తయారుచేసి ఆయా ప్రాంతాల్లో ఘర్షణలు మారణకాండలు సృష్టించడం ఈ పిశాచమూకల నిత్య కృత్యమైపోతోంది. ఆ లక్ష్యానికి ఇప్పుడు వేదికైంది అమాయక కశ్మీర్. కశ్మీర్‌లో ఉగ్రవాదోన్మాదులు చేస్తున్న అసత్యపు ప్రచారాలే సత్యమని అమాయక ప్రజలు, యువత నమ్మేదాకా వచ్చింది. కశ్మీర్‌లో స్వతంత్రం కోసం ప్రజలు పోరాడాలంటూ పొరుగుదేశమైన పాక్ తెరవెనుకనుండి చెప్తూ ..ఉగ్రవాద ముష్కరులను భారత్‌పైకి ఉసిగొల్పుతోంది. ఇదే అదనుగా ఉగ్రవాదులు అక్కడ హీరోలుగా చలామణి అవుతూ, అందుబాటులో వున్న ప్రచార సాధనాలను వినియోగించుకుని, సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాలాన్ని సైతం ఉగ్రవాద మాయాజాలానికి ఉపకరణాలుగా ఉపయోగించుకుని..మాయమాటలతో కశ్మీర్ ప్రజలను నమ్మిస్తున్నారు. భారతమాత ముద్దుబిడ్డలుగా రాణించాల్సిన యువత కొంతమంది ఉగ్రవాదుల మాటలు నమ్మి, వారి వంచన పంచన చేరి వారిచేతి ఆయుధాలుగా మారుతుండడం దురదృష్టకరం. మాయోపాయాలతో ప్రజలను నమ్మించి వారిని కూడా అరాచకశక్తులుగా మార్చి..వారి వేళ్ళతో..వారి కళ్ళను వారే పొడుచుకునేలా చేస్తూ ఉగ్రవాదులు వికృత క్రీడలు ఆడుకుంటున్నారు. ఇలాంటి అకృత్యాలే ఉగ్రవాదుల లక్ష్యాలు.. అసత్యపు ప్రచారాలే వీరి ఆయుధాలు. హత్యలు, దారుణాలు, భీభత్సాలు, తుపాకుల మోతలు..మానవబాంబులతో మారణహోమాలు సృష్టించడమే వారి ఆశయాలు. వాటిని సాధించేందుకు ఎక్కడపడితే అక్కడ, ఎంతమందినైనా సరే నిర్దాక్షిణ్యంగా మట్టుబెట్టేందుకు వెనుకాడని రక్కసిమూకలు వీరు. అందాల లోయ కశ్మీర్..ఇప్పుడు అలాంటి ఉగ్రవాద ముష్కరుల చేతికి చిక్కిపోయి అల్లాడిపోతోంది. కశ్మీర్ ప్రజలు స్వతంత్రం కోసం పోరాటం చేయాలంటూ అక్కడి ప్రజలకు నూరిపోస్తూ కశ్మీర్‌లో అశాంతిని సృష్టిస్తున్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంతో కశ్మీర్ అంతటా ఇప్పుడు ఘర్షణలతో అట్టుడికిపోతోంది. ఉగ్రవాదులే అక్కడ హీరోలుగా చెలామణి అవుతున్నారు. ల్యాబ్‌టాప్‌లు పెట్టుకుని దేశప్రగతికి దోహదం చేయాల్సిన యువతను కూడా ఉగ్రవాదులుగా మార్చి..తుపాకులు చేతపట్టేలా వారిలో విషబీజాలు నాటుతున్నారు. దీనినంతటినీ తెర వెనుకనుంచి నడిపిస్తున్నది ఎవరో అందరికీ తెలిసిందే. భారత్ ఐక్యతను, జాతీయతను దెబ్బ తీయాలనే కుట్రతో కుయుక్తులు పన్నుతోంది పాక్. కశ్మీర్‌లో గత నెలన్నర రోజులుగా జరుగుతున్న ఘర్షణలకు కారణం.పాక్ ప్రేరేపిత ఉగ్రవాదమే. ఒక్క జమ్ము కశ్మీర్‌లోనే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోనూ, బలూచిస్తాన్ వంటి ప్రాంతాల్లోనూ పాక్ చేస్తున్న ఇలాంటి అకృత్యాలకు అంతే వుండడం లేదు. కశ్మీర్ విముక్తికి పోరాడుతున్నట్లు ఉగ్రవాదులు అసత్య ప్రచారాలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతూ ఆకట్టుకొంటున్నారు. ఇలాంటి విషప్రచారాలను.. దుష్టకార్యాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాల్సివుంది. కశ్మీర్‌లో శాంతిని నశింపజేస్తున్నది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదమేనని ప్రపంచానికంతా తెలిసేలా చేయాలని ప్రధాని చెప్పడం అందుకే. ఈ నేపథ్యంలో, పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా మన జమ్మూకశ్మీర్‌లో అంతర్భాగమేనని, ఈ ప్రాంతాల్లో పాక్ చేస్తున్న అకృత్యాలన్నీ బయటపెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని మోదీ సరైన సమయంలో ధీటైన మాట చెప్పడం ఒక శుభపరిణామం. మన దేశ ఐక్యతను, జాతీయతను దెబ్బతీసేందుకు, కశ్మీర్‌లో ఘర్షణలు ప్రేరేపిస్తూ, పాక్ చేస్తున్న కుయుక్తులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ.. పాక్ కుట్రలకు దౌత్యపరంగా అడ్డుకట్టవేయడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. ఇప్పటికే కశ్మీర్ ఘర్షణలకు 55 మంది బలైపోవడం బాధాకరం. ఈ పరిస్థితి మారాలి. ఆ గాయాలు మానాలి. ఘర్షణలు సమసిపోవాలి. కశ్మీర్‌లో శాంతిస్థాపనకు, ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకు ప్రజలు, అన్ని పక్షాల నాయకులు కూడా నిండుగుండెలతో సహకరించాలి. కశ్మీర్‌లో మళ్ళీ శాంతిపుష్పాలు విరబూయాలి.. మరిన్ని అందాలతో పరిమళించాలి. ఆ రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!...

## నాయుడుపేటలో

# పినాకిని స్టాపింగ్ లేదు



నెల్లూరుజిల్లా నాయుడుపేట రైల్వే స్టేషన్లో ఈ నెల 12వ తేదీ నుండి ఉదయం నుంచి పినాకినీ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌ను అధికారికంగా నిలుపుదల చేశారు. గత ఆరు నెలలుగా నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో రైలును నిలుపుదల చేస్తున్నారు. ప్రతిరోజూ చెన్నై వైపు 70 నుంచి 80మంది, విజయవాడ వైపు 100 మంది వరకు ప్రయాణీకులు టిక్కెట్లు కొనుగోలు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పినాకినీ రైలును నిలపడంతో ప్రయాణీకులకు సౌలభ్యంగా ఉండేది.

12వ తేదీ ఉదయం 10.50 గంటలకు నిలపగా, సాయంత్రం చెన్నై నుంచి వచ్చే సమయంలో నిలపకపోవడంతో చైను లాగి ప్రయాణీకులు దిగడం జరిగింది. దీంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పినాకినీ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు ఢిల్లీ రైల్వే బోర్డు నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో నిలుపుదలను రద్దు చేశారని తెలుస్తోంది. ఈ విషయంపై తిరుపతి ఎంపి, స్థానిక నాయకులు చొరవ తీసుకుని రైలు నిలిపేందుకు కృషి చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## సత్వర న్యాయం...

# లోక్‌అదాలత్ ధ్యేయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే జాతీయ లోక్‌అదాలత్ ధ్యేయమని నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్ మౌలానా జునైద్ అహ్మద్ పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఉత్తర్వుల మేరకు ఈ నెల 13న జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవనంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజలందరికి విస్తృతంగా న్యాయసేవలు అందించడంతో పాటు తక్షణ పరిష్కారం లోక్‌అదాలత్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 85 కేసులను అదనపు జిల్లా జడ్జీలు పాపిరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సత్యవాణి, జూనియర్ సివిల్ జడ్జీలు పద్మ, హేమలత ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 300 కేసులను పరిష్కరించి మోటారు ప్రమాద కేసులలోని పిటిషనర్లకు పరిహారంగా రూ. 1,86,31,408లు చెల్లించారు.

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్యామలాదేవి, మెజిస్ట్రేట్‌లు శోభారాణి, వాసుదేవన్, అరుణశ్రీ, జూనియర్ సివిల్‌జడ్జి కేశవ్, బ్యాంక్, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అవయవదానంతో.. 8మందికి పునర్జన్మ!

### అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్

అవయవదానంతో 8మందికి పునర్జన్మ ఇవ్వొచ్చని అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీ నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి, సెట్నెల్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన వారు అవయవదానంతో 8మందిని ఆదుకోవచ్చన్నారు. అవయవదానాన్ని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం అవయవదానం చేసిన నారాయణమ్మ, సుభాషిణి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మెన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ చక్రవర్తి, సెట్నెల్ సిఇఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మత ప్రచారాలు ఆపండి

ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గంగలో మునిగి హోమం చేయడం హిందువులకు అతని పట్ల గౌరవాన్ని పెంచింది. ప్రజా నాయకులన్న వారు ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించాలి. అలాగే జగన్ బావ అనిల్‌కుమార్ క్రైస్తవ మత ప్రచార సభల్లో పాల్గొంటూ పూనకం వచ్చినట్లు డ్యాన్సులు వేస్తున్నాడు. ఇది జగన్ మీద ప్రభావం చూపిస్తోంది. కాబట్టి వారి కుటుంబసభ్యులు బహిరంగ మత ప్రచారాలకు దూరంగా వుంటే వారికి దూరమైన ఆయా వర్గాల ప్రజలు దగ్గరవుతారు.

**సి.రాజీవి, నెల్లూరు.**

# మోడీ మొనగాడనిపించాడు




మొండిగా వుండే వాళ్లతో మనం కూడా జగమొండిగానే వ్యవహరించాలి. పదేపదే కాశ్మీర్ సమస్యను ప్రస్తావిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి సమాధానమే ఇచ్చాడు మన ప్రధాని నరేంద్ర మోడీ! ఇరుదేశాల మధ్య సమస్య కాశ్మీర్ కాదని, ఆక్రమిత కాశ్మీరే ప్రధాన సమస్య అని తేల్చిచెప్పి, పాక్‌పై ఎదురుదాడికి దిగాడు. అంతేకాదు, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి భారత్‌కు అప్పగించడమే ఇరు దేశాల మధ్య గొడవలకు శాశ్వత పరిష్కారమంటూ పాక్ పాలకుల చెంప ఛెళ్లుమనిపించాడు మోడీ! ఇదే మొండితనంతో కాశ్మీర్ సమస్యకు మోడీ ఒక శాశ్వత పరిష్కారం చూపాలి!

**సి.గోవిందసింగ్, హైదరాబాద్.**

# విష నాగులను ఏరివేయాలి

గ్యాంగ్‌స్టర్ నయీమ్‌ను అంతమొందించిన కేసీఆర్ ప్రభుత్వానికి అభినందనలు. పోలీసుల అండ లేనిదే నయీమ్ ఇన్ని అకృత్యాలు చేయగలిగేవాడు కాదు. ఆదిలోనే ఇలాంటి విషమొక్కలను తుంచేయాలి. మావోయిస్టుల ఏరివేతకు తోడ్పడ్డాడని చెప్పి, అతనిని మాఫియాడాన్‌ను చేయడం పోలీసుల అసమర్ధతకు నిదర్శనం. హత్యలు, అత్యాచారాలు, భూకబ్జాలు, దోపిడీలకు పాల్పడే ఏ ఒక్కరినీ వదలకూడదు. నయీమ్‌కు పట్టిన గతే ఇలాంటి వారందరికీ పట్టాలి.

**బోడె కృష్ణకుమార్, పొదలకూరు.**

# కరుగుతున్న ఆశలు

## 'మంత్రి' పదవి తూతూ మంత్రమేనా?





**చంద్రబాబు మంత్రి వర్గాన్ని విస్తరిస్తాడని, అందులో తమకు చోటుంటుందని చాలామంది నాయకులు ఆశపడుతున్నారు. బాబు నోట విస్తరణ మాట ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. అయితే చంద్రబాబు 'ఆ ఒక్కటి అడక్కు' అన్న టైపులో వ్యవహరిస్తూ మిగతావన్నీ మాట్లాడుతున్నాడు.**

ఈసారి విస్తరణ అంటూ జరిగితే రెడ్లకు పెద్దపీట వేస్తారని, కనీసం ఇద్దరు లేదా ముగ్గురు రెడ్లను కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకుంటారని సమాచారం. ఈ కోవలో చూస్తే వైసిపి నుండి వలస వచ్చిన భూమా నాగిరెడ్డి, ఆకే అమర్‌నాథ్‌రెడ్డిలకు ప్రాధాన్యత నివ్వాల్సి వుంటుంది. వీళ్లిద్దరూ కర్నూలు, చిత్తూరు జిల్లాల వాళ్లు. ఇక నెల్లూరుజిల్లాలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రకాశం జిల్లాలో మాగుంట శ్రీనివాసులురెడ్డి మంత్రి పదవుల రేస్‌లో వున్నారు. ప్రకాశం జిల్లా స్థానిక శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టడానికి మాగుంట శీనయ్యకు మంత్రి పదవి ఆశ పెట్టారు. చంద్రబాబు ఆ హామీ ఇవ్వకుంటే ఆయన ఎమ్మెల్సీగా పోటీకి దిగేవాడు కాదు. ప్రకాశం జిల్లాలో శిద్దా రాఘవరావు మంత్రి స్థాయిలో పని చేస్తున్నాడు. కాబట్టి అక్కడ పెద్దగా లోటు కనిపించడం లేదు.

నెల్లూరుజిల్లాకు మాత్రం మంత్రిగా పి.నారాయణ వున్నా, లేనట్లే లెక్క. ఆయన రాజధాని కట్టుబడి, భూముల లెక్కలకు సంబంధించిన మంత్రే కాని నెల్లూరుజిల్లా రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా వున్నాడు. జిల్లాలో పార్టీ కేడర్‌కు అండగా నిలవడానికి, ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలను తీసుకెళ్ల డానికి, అన్ని నియోజకవర్గాలలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ఒక యాక్టివ్ మంత్రి కావాలి. నారాయణ వల్ల జిల్లాలో ప్రజలకు గాని, ఆయన వుంటున్న పార్టీకి గాని పైసా ప్రయోజనం లేదు. కాబట్టి జిల్లా నుండి ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఆ పార్టీ కేడర్ కోరిక. జిల్లాలో ఇప్పటికే పార్టీ మునుపటి కన్నా బలహీనంగా వుంది. పార్టీని నారాయణ మీదే వదిలేస్తే ఇంకా చచ్చుబడినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. పార్టీలో ఊపు, ఉత్సాహం కోసం సోమిరెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న అభిప్రాయం బలంగానే వుంది.

అయితే చంద్రబాబులో మంత్రి వర్గాన్ని విస్తరించాలన్న ఆలోచనే వున్నట్లు లేదు. దీనిని కలబెడితే లేనిపోని తలనొప్పులు తలెత్తుతాయని భయపడుతున్నట్లున్నాడు. మంత్రివర్గాన్ని విస్త రించి, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుండి 'రెడ్ల'కు ప్రాధాన్యత కల్పించకుంటే ఈ జిల్లాల్లో గతంలోలాగే పార్టీ నష్ట పోవడం ఖాయం.

### • టేకు చెట్ల వ్యవహారం

## కొండెక్కిన కేసు... వేదికెక్కిన నిందితుడు!

అధికారం చేతిలో వుంటే ఎన్ని ఆటలైనా ఆడొచ్చు... ఎన్ని అడ్డదారులైనా తొక్కచ్చు. నెల్లూరురూరల్ తెలుగుదేశం నాయకులు దీనిని నిరూపించారు కూడా!

నెల్లూరు రూరల్ మండలం నరసింహపురంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంకు చెందిన భూమిలో టేకు చెట్లను అక్రమంగా నరికి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, దేవిరెడ్డి హరిశివారెడ్డిలపై రూరల్ పోలీసులు కేసులు పెట్టారు. వారి కోసం తీవ్రంగా గాలించారు. వేమిరెడ్డి హరిశివారెడ్డి పోలీసుల కళ్లు గప్పి కోర్టులో లొంగిపోగా, హంసకుమార్‌రెడ్డి అక్కడా ఇక్కడా దాక్కుని, చివరికి హైదరాబాద్‌లో బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతూ దొరికి పోయాడు. ఇదంతా కూడా ఐదు నెలల క్రితం జిల్లాలో సంచలనం రేపిన సంఘటన. ఈ కేసు వెలుగులోకి వచ్చాక తెలుగుదేశం నాయకులు దేవుడి సొమ్మును తిన్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అతనిని పార్టీలో చేర్పించిన రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా... ఎవరు పార్టీలోకి వస్తామన్నా తీసుకోండని చంద్రబాబు చెప్పారని, ఆయన మాటను బట్టే హంసను పార్టీ లోకి తీసుకున్నామని, అంతేగాని, ఆయన కేసులతో మాకేం సంబంధమని మాట్లాడారు. హంసకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసాక స్వయంగా మంత్రి పి.నారాయణే జోక్యం చేసుకుని, పోలీసుల మీద ఒత్తిడి తెచ్చి అతని మీద పెట్టిన కేసులను వీక్ చేయించాడు. ఆ తర్వాత నిందితులు బెయిల్ పొంది ఇప్పుడు దర్జాగానే తిరుగుతున్నారు.

కాగా, అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే, ఏ దేవస్థానంకు చెందిన ఆస్తులను అమ్మాడన్న కేసుల్లో అయితే ఆయనున్నాడో అదే వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన అతిథిగా పాల్గొనడం. మల్లినేని వెంకటేశ్వర్లునాయుడు అధ్యక్షుడుగా ఈ దేవస్థానం కొత్త ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం మొన్న జరిగింది. కేసు బయటకొచ్చినప్పుడు ఏ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అయితే, హంస కుమార్‌రెడ్డితో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకున్నాడో, అదే ఆదాల ప్రమాణస్వీకారోత్సవం రోజున ఆయన ఇంటి కెళ్లి ఆహ్వానించాడు. ప్రమాణస్వీకారోత్సవానికి వేమిరెడ్డి హంస కూడా హాజరయ్యాడు. స్వామి సొమ్మును మింగా మనే పశ్చాత్తాపం కూడా లేకుండా స్వామి సన్నిధిలోనే హల్‌చల్ చేశాడు. నరసింహస్వామి ఉగ్రనరసింహ స్వామి అవతారం చాలించి... శాంతి నరసింహస్వామి అయినట్లున్నాడు.

### మానుగుంట చూపు...

# ఏ పార్టీ వైపు...

## చేర్చుకోవడానికి ఇరు పార్టీలు సిద్ధం



**నెల్లూరు లోక్‌సభ పరిధిలోకి వచ్చే ప్రకాశం జిల్లా కందుకూరు నియోజక వర్గంలో బలమైన నాయకుడు, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రస్తుతమున్న కాంగ్రెస్‌ను వీడి ఏ పార్టీలో చేరనున్నాడన్నది ప్రశ్నార్థ కంగా మారింది. ఈయన కాంగ్రెస్‌ను వీడడం అయితే ఖాయమైంది. ఆయ నను చేర్చుకోవడానికి అటు వైయస్సార్ కాంగ్రెస్‌తో పాటు ఇటు తెలుగుదేశం కూడా సిద్ధంగా వుంది. ఇరుపార్టీలు కూడా సీటు విషయంలో హామీ ఇస్తున్నాయి.**

2014 ఎన్నికలలో కందుకూరులో వైసిపి అభ్యర్థిగా పోతుల రామారావు గెలవడం తెలిసిందే! ఇటీవలే ఆయన తెలుగుదేశం దూరాడు. అక్కడ ఇప్పటికే తెలుగుదేశంలో దివి శివరాం బలమైన నాయకుడిగా వున్నాడు. రేపు వీరిలో చంద్రబాబు ఎవరికి సీటిస్తాడన్నదే సంశయంగా వుంది. కాగా కాంగ్రెస్‌లో వున్న మహీధర్‌రెడ్డిని కూడా పార్టీలోకి తీసుకు రావాలని చంద్రబాబు తన వాళ్లను ఆదేశించాడు. మహీధర్‌రెడ్డితో ఆ పార్టీ నాయకులు కూడా మంతనాలు జరుపుతున్నారు. సిటింగ్ ఎమ్మెల్యేగా పోతుల రామారావుకే కందుకూరు సీటిచ్చి, మహీధర్‌రెడ్డికి కావలి సీటివ్వాలన్న ప్లాన్ వుంది. కావలి ఇన్‌ఛార్జ్‌గా వున్న బీద మస్తాన్‌రావును నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయించడమో లేక రాజ్యసభకు పంపించడమో చేయొచ్చు. అయితే ఇదంతా కూడా మహీధర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరడానికి ఒప్పుకుంటే జరిగే మార్పు. మొదట ఆయన వైకాపా వైపే మొగ్గు చూపాడు. ఈమేరకు ఆ పార్టీ అధినేత జగన్‌ను కూడా కలిసి మాట్లాడాడు. పోతుల రామారావు తెలుగుదేశంలోకి పోవడంతో కందుకూరు సీటును మహీధర్‌రెడ్డికి ఇస్తామని కూడా చెప్పారు. వైకాపాలో చేరితో సొంత సీటే దొరుకుతుంది. తెలుగుదేశంలో చేరితే సొంత సీటు ఆశలు లేవు. పక్కకు మారాల్సిందే! అదీగాక 2019 ఎన్నికల ట్రెండ్ ఎలా ఉంటుందో ఒక అంచనాకు రావాలి. ఏ పార్టీ పరిస్థితి బాగుందన్నదానిపై ఒక అంచనాకు వచ్చాకే ఆయన పార్టీ మారే ప్రోగ్రామ్ ఉండొచ్చు.

## పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం కృషి

### - ఎమ్మెల్సీ సోమిరెడ్డి



జెండా వందనం చేస్తున్న సోమిరెడ్డి

పేద విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రభుత్వ తరఫున లభించే అవకా శాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరురూరల్ అల్లీపురంలోని సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల్లోని విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, ఇక్కడ అన్ని వసతులను కల్పిస్తున్నా మెరుగైన ఫలితాలను ఎందుకు సాధించడం లేదని పాఠశాల ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖ రాలను అధిరోహించాలన్నారు. గతేడాది ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ మేకల రామ్మూర్తి, నాయకులు బండి శ్రీకుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, అనిల్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.





నెల్లూరీయుల కోసం... అత్యాధునిక వసతులతో, ఆకర్షణీయమైన అలంకరణలతో
నెల్లూరు నగర నడిబొడ్డులో...



GPR Grand
(Centrally Air-Conditioned)
కళ్యాణ మండపం

నిర్మించి 25-08-2016 నాటికి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుని
నూతనోత్సాహంతో పదవ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా
శుభాకాంక్షలు తెలియజేస్తూ... మాకు ఎల్లవేళలా సహకరిస్తున్న
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు,
మిత్రులకు, ప్రతి ఒక్కరికీ...
హృదయపూర్వక ధన్యవాదాలు.



గునపాటి వెంకట కృష్ణారెడ్డి



## మూడో సమ్మర్

జిల్లాలో మూడో సమ్మర్ రన్నింగ్‌లో ఉన్నట్లుంది. ఎండలు బాగానే మండుతున్నాయి. ఎండలు తగ్గుముఖం పట్టడం, వర్షాలు రావడం, వాతావరణం చల్లబడడం, మళ్లీ ఎండలు ముదరడం... ఈ ఏడాదిలో ఇప్పుడు కాస్తున్న ఎండలు మూడో వేసవి కాలమని చెప్పుకోవచ్చు. ఆగస్టు నెలలో కూడా 36డిగ్రీల ఎండలుంటున్నాయి. దీనికితోడు ఉక్కపోత కూడా ఎక్కువగానే వుంటోంది.

## నగరంలో నరకయాతన!

ప్రభుత్వ కార్యాలయాలలో సిబ్బంది లేరు... పోలీస్‌స్టేషన్‌లలో ఒకరిద్దరు కానిస్టేబుళ్లు తప్పితే పోలీసులు లేరు... ట్రాఫిక్‌ను సరిదిద్దడానికి రోడ్ల మీద పోలీసులు లేరు... అందరూ పుష్కరాల విధులకు వెళ్లారు. ఒకటి రెండు రోజులు కాదు... ఏకంగా రెండు వారాలు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఎవరికీ పనులు కావడం లేదు. ఈ విషయం అటుంచితే, నెల్లూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు లేక ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా శ్రావణమాసం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో నగరంలో వాహనాల తాకిడి ఎక్కువైంది. నగరంలోని కళ్యాణ మండపాల వద్ద వందల సంఖ్యలో వాహనాలు వుంటున్నాయి. ఈ కళ్యాణ మండపాలకు వచ్చి పోయే వాహనాలతో కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్, మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి, రామలింగాపురం జంక్షన్, విజయమహల్ గేటు, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్‌జామ్‌లు అవుతున్నాయి. ఒకరిద్దరు పోలీసులు ఈ ట్రాఫిక్‌ను సరిద్దిలేకపోతున్నారు. వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

## టిక్కెట్ల కోసం కుస్తీ!

పెళ్లిళ్లు, వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో సోమవారం నెల్లూరు నుండి పలు ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లు కిటకిటలావడాయి. సీజన్ బట్టి ప్రయాణికులను నిలువుదోపిడీ చేసుకునే ప్రైవేట్ ట్రావెల్స్ వాళ్లు యధాఫలంగా అధికారేట్లు పెట్టి పిండేశారు. 13వ తేదీ రెండో శనివారం, 14వ తేదీ ఆదివారం, 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం... వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, వేలూరు, విజయవాడ, విశాఖ వంటి నగరాలలోవున్న నెల్లూరుకు చెందిన ఉద్యోగులు, ఆయా చోట్ల చదువుకొనే విద్యార్థులు 13వ తేదీ కల్లా నెల్లూరు జిల్లాకు చేరుకున్నారు. 3రోజులు సెలవులు గడిపిన అనంతరం సోమవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. సెలవుల రద్దీని అంచనా వేసి ముందుగానే రైళ్లలో, బస్సుల్లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న వాళ్లకు ఏ సమస్యాలేదుగాని, రిజర్వేషన్ చేసుకోని వాళ్లు తిరుగు ప్రయాణానికి చాలా ఇబ్బందిపడ్డారు.

కృష్ణ పుష్కరాల నేపథ్యంలో విజయవాడకు ఎక్కువ స్పెషల్ బస్సులు నడుపుతుండడం వల్ల బెంగుళూరు, హైదరాబాద్‌లకు ఎక్కువ సంఖ్యలో స్పెషల్ బండ్లు నడపలేకపోయారు. ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రం పరిస్థితిని అవకాశంగా మలచుకుని సాధారణ ఛార్జీని రెండింతలు చేసి ప్రయాణీకులను నిలువుదోపిడీ చేశాయి.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరులో కేంద్రమంత్రి



కేంద్ర ఆర్థికశాఖా సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ నెల 16న నెల్లూరొచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగాయాత్రను ప్రారంభించి, నగరంలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మూడోబిడ్డ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వెళ్లారు. ట్రస్టులో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను, శిక్షణా కేంద్రాలను పరిశీలించి ట్రస్టు చేస్తున్న పనులను అభినందించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కూడా ఆయన వెంట వున్నారు.

## భలే.. భలే... బైక్‌లు!



ప్రపంచశ్రేణి విదేశీ బైక్‌లు 15వ తేదీ నెల్లూరులో కనువిందు చేశాయి. 'ఇండిపెండెంట్ రైడ్' పేరుతో జరిగిన బైక్‌ల ప్రదర్శనలో నెల్లూరుకు చెందిన యువకులు లక్షలాది రూపాయల విలువచేసే బైక్‌లను నడిపి అలరించారు. హార్లీడేవిడ్‌సన్, ట్రైంప్, బెక్లీ కంపెనీలకు చెందిన బైక్‌లతో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దర్గామిట్టలోని యంజిబి మాల్ వద్ద ఈ రైడ్‌ను ఎం.జి.బ్రదర్స్ కంపెనీ అధినేత ఎం.ఆర్.గంగాధర్ ప్రారంభించారు. ఇక్కడ నుండి మొదలైన ప్రదర్శన కేవిఆర్ పెట్రోల్‌బంకు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆత్మకూరు బస్టాండ్, మినీబైపాస్, అన్నమయ్య సర్కిల్, అయ్యప్పగుడి మీదుగా సాగి తిరిగి ఎం.జి.బి.మాల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో ఎం.జి.బి మాల్ జాయింట్ డైరక్టర్ ఎం.జి.గోపాలకృష్ణ, ఎంజిబి ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరక్టర్ ఎం.జి.రాఘవేంద్ర, బైకర్ హుడ్ సభ్యులు జీవన్‌రెడ్డి, కస్తూరి తిలక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేదవ్యాసలో స్వాతంత్ర్య వేడుకలు



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూలులో సోమవారం 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూలు కరస్పాండెంట్ ఎ.పి.బాలాజీ జాతీయ పతాకం ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధుల గురించి ఉపన్యసించారు. అనంతరం 70ఏళ్ల స్వాతంత్ర్యంలో మన దేశ అభివృద్ధికి సంబంధించి గేయనాటకాన్ని పిల్లలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎ.పి.వేదగిరి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓ పక్క గాంధీ నామ స్మరణం...

# మరోపక్క బ్రాందీ సేవనం

70వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ పక్క ప్రజలు జాతీయ పతాకాలను ఆవిష్కరించి, జెండా పండుగ జరుపుకుంటూ జాతిపిత మహాత్మగాంధీని స్మరించుకునే సమయంలో... మరోపక్క బ్రాందీషాపుల వద్ద దొడ్డిదారి గుండా వెళ్లి బ్రాందీ సేవిస్తూ... స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఈ విధంగా కూడా జరుపుకోవచ్చని చాటిచెప్పారు. రిపబ్లిక్‌డే, ఇండిపెండెన్స్‌డే, అక్టోబర్ 2 గాంధీ జయంతి... ఈ మూడు రోజులను డ్రైడేలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మూడ్రోజులు మద్యపానం, మాంసం అమ్మకాలు నిషిద్ధం. అయితే అది చెప్పుకోవడానికి మాత్రమే! మొన్న 15వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవం రోజున నెల్లూరులోనే అత్యధిక సంఖ్యలో వైన్‌షాపుల వద్ద మద్యం అమ్మకాలు యధేచ్ఛగా సాగాయి. కాకపోతే షాపుకు ముందున్న షట్టర్లు మూసేసి వెనుక నుండి అమ్మకాలు జరిపారు. సాధారణ రోజుల్లో కంటే డ్రై డే రోజు ఒక్కో ఫుల్ బాటిల్ మీద వంద రూపాయలు పెంచి అమ్మారు. ఎక్సైజ్ వాళ్లు మాత్రం అక్కడక్కడా తిరిగి తనిఖీలు చేశారు గాని పెద్దగా ఫలితం లేదు.

## నేస్తం ఫౌండేషన్‌కు

# ఉత్తమ సేవా పురస్కారం



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఏడాది ఉత్తమ సేవలు అందించిన స్వచ్ఛంధ సేవాసంస్థలకు అందించే ఉత్తమ సేవా పురస్కారాన్ని ఈ ఏడాది ప్రభుత్వం నేస్తం ఫౌండేషన్‌కు ప్రదానం చేయడం జరిగింది. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ విశాల్‌గున్నీ సమక్షంలో రాష్ట్రమంత్రి నారాయణ నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. నేస్తం ఫౌండేషన్ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలు, మిగులు ఆహార పంపిణీ, రక్తదాన కార్యక్రమాలు, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినందుకు అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అంధుల పాఠశాలలో...

# యంయస్ఆర్ సేవా సమితి ఇండిపెండెన్స్ డే



నెల్లూరు, దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో మాగుంట శరత్ చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంధుల పాఠశాలలోని పిల్లల చేత కేక్ కట్ చేయించి, వారికి స్వీట్స్, చాక్లెట్స్ పంచిపెట్టారు. సమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి ఆశయాలలో భాగంగా అంధుల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని సమితి సభ్యులు కమతం అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా మహేష్, నూనె రిషికేష్ యాదవ్, నిషాద్, మనోజ్, సాయికృష్ణ, మోహన్‌రెడ్డి, అమరవరపు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## రత్నంలో ఎగిరిన త్రివర్ణ పతాకం



దేశభక్తులు, స్వతంత్ర సంగ్రామయోధుల త్యాగఫలం మూలంగా నేడు 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నామని రత్నం జూనియర్ కళాశాల ఛైర్మెన్ కె.వి.రత్నం కొనియాడారు. నెల్లూరులోని రత్నం కళాశాలలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ భారతదేశం నాటి నుండి నేటి వరకు ఎన్నో విజయాలను సాధించిందని, దాని మూలం మన విద్యావ్యవస్థ అంటూ... విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉంటే దేశ ప్రగతి పురోభివృద్ధి చెందుతుందని, నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యావకాశాలు పెరిగాయని, తద్వారా శాస్త్రవేత్తలు, నాయకులు, అధికారులు వస్తున్నారని... ఇది గుర్తించి నేటి యువత ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 29న క్రీడా ప్రతిభా పురస్కారాలు

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 10గంటలకు క్రీడాకారులకు ప్రతిభాపురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మెన్, నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ నెల్లూరు నవాబుపేటలోని ఎస్ఎస్ఎఫ్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఆరేళ్ల క్రితం స్పోర్ట్స్ ఫౌండేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. అప్పట్నుంచి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం నాడు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. క్రీడా ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన దరఖాస్తులను ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యాలయంలో ఉంచామన్నారు. ఈ నెల 25లోగా క్రీడాకారులు దరఖాస్తులను అందజేయాలన్నారు.

ఈ సమావేశంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి సరాబు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు వెంకు పాల్గొన్నారు.

## అనాధలపై...
# వేమిరెడ్డి 'వాత్సల్య'ం

### • స్వాతంత్ర్య వేడుకల్లో ఔదార్యం




నెల్లూరు జనహిత, వాత్సల్య సంస్థ ఆధ్వర్యంలో 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దాత, వితరణశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వాత్సల్య నిర్వాహకులు పిల్లలకు చక్కని విద్యాబుద్ధులతో పాటు నైతిక విలువలు నేర్పిస్తూ నిరాధార బాలబాలికలు, పేద బడుగు వర్గాలకు చెందిన బాల బాలికల అభివృద్ధికి నిస్వార్థంగా పని చేస్తున్నారని కొనియాడారు. పిల్లలు చేసిన నృత్యాలు, అన్నమాచార్య సంకీర్తనలు, శతక పద్యాలు, యోగా తమ ప్రతిభతో చక్కగా ప్రదర్శించారని ప్రశంసిస్తూ వాత్సల్యకు రూ.5లక్షలు విరాళాన్ని అందజేశారు. వాత్సల్య కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు మాట్లాడుతూ గత 6సంవత్సరాలుగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని, 65శాతంపైన మార్కులు సాధిస్తున్నార న్నారు. తొలుత ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డా॥ ఫణికృష్ణ పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువు ఎంత అవసరమో ఆరోగ్యం కూడా చాలా అవసరమని, పిల్లలకు చదువుతో పాటు వ్యాయామాలు కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహావీర్‌జైన్ సేవాసమితి అధ్యక్షుడు మోహన్ లాల్ యస్ జైన్, జె.పి.జైన్, శ్రీరామకృష్ణ సేవాసమితి కార్యదర్శి మోదం మల్లిఖార్జునరావు, వాత్సల్య సంస్థ అధ్యక్షులు పలనాటి రామదండు, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, హరికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సంస్థ గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.



# ఆర్భాటం జాస్తి... అభివృద్ధి నాస్తి

**- అనిల్ యాదవ్**



చంద్రబాబు పాలనలో అవినీతి, ప్రచారం జాస్తిగాను, అభివృద్ధి నాస్తిగానూ ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. 16వ తేదీ ఆయన గడప గడపకు వైకాపా కార్యక్రమంలో భాగంగా కాపువీధి, కామాటి వీధి, ఆచారివీధి, చిన్నబజారు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ బాబొచ్చాక జాబులు రావడం మాని ఉన్న ఉద్యోగాలు కూడా పోతున్నాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎంతో కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను నిలువునా తొలగిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 12 పరిశ్రమలకు శంకుస్థాపన చేసామని మంత్రి నారాయణ చెప్పారని, ఇంకా కొన్ని పరిశ్రమలు రాబోతున్నాయన్నారని, ఇవన్నీ పచ్చి అబద్దాలని, ఈ రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అనిల్ విమర్శించాడు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్, వైసిపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు వేలూరు సుధారాణి, గోగుల నాగరాజు, ఖలీల్‌అహ్మద్, అశోక్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుల పోరాట ఫలం...
# ఈ స్వేచ్ఛాపరిమళం

### • ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఈ నెల 15వ తేదీన 70వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నెల్లూరులో ఘనంగా జరిగాయి. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ త్యాగధనుల పోరాట ఫలితమే నేటి మన స్వేచ్ఛా పరిమళాల జీవితమన్నారు. త్యాగధనుల ఆశయ సాధనకు మనం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ రంగాలలో సాధిస్తున్న ప్రగతి, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు.

ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా సాగింది. మైక్రో ఇరిగేషన్ శకటానికి మొదటి బహుమతి, నీటి యాజమాన్య సంస్థ శకటానికి ద్వితీయ బహుమతి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శకటానికి తృతీయ బహుమతి దక్కాయి. ఇక వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గేయాలు అలరించాయి. అలాగే ప్రతిభ చూపిన ఉద్యోగులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు, వివిధ శాఖల లబ్దిదారులకు ఉపకరణాలు, ఋణాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. జాతీయ గీతంతో ముగిసిన ఈ వేడుకలలో జడ్పీ ఛైర్మన్ బి.రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.








## సింహపురిలో...
# విజయవంతంగా న్యూరో నావిగేషన్ శస్త్ర చికిత్సలు

ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ద్వారా ప్రారంభింపబడిన అత్యంత అధునాతన న్యూరో నావిగేషన్ పరికరంతో విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సింహపురి హాస్పిటల్స్ న్యూరో సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర ప్రసన్న తెలిపారు. ఈ నెల 13న హాస్పిటల్లోని ఆడిటోరియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యూరో నావిగేషన్ పరికరంతో దినకర్, పద్మావతి, కృష్ణయ్య అనే ముగ్గురు వ్యక్తులకు శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. వీరందరూ ఫిట్స్‌తో బాధపడుతూ సింహపురి హాస్పిటల్ నందు డాక్టర్ దీక్షాత్ నారాయణ్ వద్దకు వచ్చారని, ఆమె అన్ని పరీక్షలు నిర్వహించి, వారికి మెదడులో చిన్నచిన్నకణితులున్నాయని వారిని తన వద్దకు పంపారని చెప్పారు. వీరిలో దినకర్ అనే 21 సంవత్స రాల యువకునికి మత్తుతో సర్జరీ చేస్తే కాలు, చేయి పడిపోయే అవకాశం ఉండడంతో పూర్తి స్పృహలో ఉండగానే అతనితో మాట్లాడుతూనే




"అవేక్ క్రేనియాటమీ" శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పద్మావతి అనే మహిళకు అతి చిన్నరంధ్రంతోనే జుట్టు ఏమాత్రం తొలగించకుండానే శస్త్ర చికిత్స నిర్వహించామని, కృష్ణయ్య అనే వ్యక్తికి కూడా అతి తక్కువ కోతతోనే సర్జరీ విజయవంతంగా నిర్వహించామని, ఈ న్యూరో నావిగేషన్ ద్వారా మెదడులో ఎంత లోతుగా కణితులు ఉన్నప్పటికీ మెదడుకి ఏ మాత్రం నష్టం జరుగకుండా కేవలం కణితిని మాత్రమే తొలగించే వీలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ న్యూరో నావిగేషన్ పరికరం నవ్యాంధ్రలోనే మొట్ట మొదటిదని, చెన్నైలో కూడా లేకపోవడంతో అక్కడి డాక్టర్లు కూడా తమ వద్దకే సిఫారసు చేస్తున్నారని, కావున అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో డాక్టర్ దీక్షాంత్ నారాయణ్, డాక్టర్ సతీష్, సి.ఎ.ఓ. నాగేంద్ర ప్రసాద్, పేషెంట్లు దినకర్, పద్మావతి, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మువ్వన్నెల జెండా రెపరెపలు





ప్రతిష్టాత్మక పారిశ్రామికవాడ శ్రీసిటీలో ఈ నెల 15వ తేదీన 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బిజినెస్ సెంటర్ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో డెవలప్‌మెంట్ కమిషనర్ యస్.కె.సాయల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరులోనే 'శ్రీ' వున్న ఈ పారిశ్రామికవాడ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. శ్రీసిటీ యం.డి. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ దేశ, విదేశ పరిశ్రమలకు కేంద్రంగా పురోగమిస్తున్న 'శ్రీసిటీ' 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రతిరూపంగా నిలుస్తూ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఈ వేడుకల్లో శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి, భద్రతాధికారి అల్తాఫ్, జనరల్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# బాదిపల్లికి ఇండియన్ పోలీస్ మెడల్



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్

గూడూరు డివిజన్ వార్తలు

గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం కృష్ణా పుష్కరాల విధుల్లో ఉన్నారు. ఈయన అనంతపురం జిల్లాకు చెందిన వారు. 1989లో సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా ఎంపికై శిక్షణ అనంతరం 1990లో కర్నూలు రేంజ్‌లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎస్సైగా అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పని చేశారు. 2006లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొంది, ఏసిబి, శిక్షణ కళాశాల, ఏపి ట్రాన్స్‌కో, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో పని చేశారు. 2011లో డిఎస్పీగా పదోన్నతి పొంది ఏడాదిపాటు యూఎన్‌వోలో పని చేశారు. ఆ తర్వాత చిత్తూరుజిల్లాలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ గూడూరుకు 2014 అక్టోబర్‌లో బదదిలీపై వచ్చారు. ఇక్కడికి వచ్చిన తరువాత సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో చోరీలకు సంబంధించి తమిళనాడులోని శాంతిలాల్ ముఠా, బాబు ముఠాలను అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.2కోట్లు వరకు రికవరీ చేయించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇంకుడు గుంతలను పోలీస్‌స్టేషన్‌లో తవ్వించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 135 రివార్డులు, 2000లో ఉగాది పర్వదినాన పోలీస్ సేవాపతక పురస్కారం పొందారు. డిఎస్పీగా విధుల్లో ఉన్న సమయంలో ఎర్రచందనం నియంత్రణ, ఫ్యాక్షన్, మతకలహాల నియంత్రణ చేశారు. గూడూరులో 2015 భారీ వరదల సమయంలో ప్రజలకు చేసిన సేవలతో ప్రత్యేకంగా గుర్తింపు పొందారు. ఆయన పనితీరు, తదితరాలను పరిశీలించి ఇండియన్ పోలీస్ పతకానికి ఎంపిక చేశారు. ఆయన ఎంపిక కావడంపై డివిజన్ పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ 'లాయర్'తో మాట్లాడుతూ అందరి సహకారం, కృషితోనే ఈ పతకం వచ్చిందని వివరించారు. పతకం మరింత బాధ్యతలను పెంచిందని, ప్రత్యేకంగా గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు.

# గూడూరు రోటరీ విశిష్ట సేవలు



వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ




వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

గూడూరు రోటరీ క్లబ్ 2015-16సంవత్సరంలో 90కిపైగా విశిష్టమైన, వైవిద్యభరితమైన సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను క్లబ్ అధ్యక్షులు ఎస్.వి.అశోక్ చక్రవర్తి, కార్యదర్శి పసుపులేటి మునిరాజాను ఇటీవల అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీభవన్‌లో జరిగిన వీడ్కోలు సభలో పట్టణ ప్రజలు, నాయకులు శ్లాఘించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులతో పాటు యూనిఫారాలు, స్కూలు బ్యాగులు, బెంచీలు, పుస్తకాలు, అలాగే వివిధ పాఠశాలలకు సీలింగ్ ఫ్యాన్లు, మైక్‌సెట్, రూ.6లక్షలు విలువైన ఒక స్కూల్ బస్సు ఈ సంవత్సరంలో బహుకరించడం జరిగాయన్నారు. అలాగే గూడూరు తహశీల్దార్ ఆఫీసులో నిర్మించిన సందర్శకుల హాలు, పసి బిడ్డలకు వెల్‌బేబి షో, వయోవృద్ధులకు ఫలసరుకులు, దివంగతులకు లక్ష రూపాయలు విలువైన మరో నూతన శీతల శవపేటిక, వ్యాధిగ్రస్తులకు మందులు, వికలాంగులకు ట్రైసైకిళ్లు, బీద మహిళలకు కుట్టుమిషన్లు, భిక్షగాళ్లకు దుప్పట్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఎ.శ్రీనివాసాచారి, శివబాలన్ (చెన్నై), శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(మనుబోలు), ఎస్.వి.శ్రీధర్(గూడూరు) తదితర స్థానికేతరులు, వ్యాపారులు మొదలగు వారు పెద్దమొత్తంలో ఆర్థిక ప్రోత్సాహాన్నందించారన్నారు. ఈ సంవత్సర కాలంలో పార్లమెంటు సభ్యులు వరప్రసాద్‌రావు, శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, సబ్‌కలెక్టర్ గిరీషా, డిఎస్పీ శ్రీనివాస్, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, పలువురు డాక్టర్లు తమ క్లబ్ కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు.

# బాలసదన్‌కు ఇన్నర్‌వీల్ ఇన్వర్టర్




ఇన్వర్టర్‌ను బహుకరిస్తున్న డాక్టర్ సి.రోహిణి, స్నేహలతారెడ్డి

ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో గూడూరు రెండో పట్టణంలో వున్న బాలసదనంలో విద్యార్థుల సౌకర్యార్థం డాక్టర్ సి.రోహిణి దాతృత్వంతో 20వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను మంగళవారం అందజేశారు. వైకాపా నాయకుడు వై.గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి పాల్గొని మాట్లాడుతూ తమ సేవలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పరమేశ్వరి, జీవని, లక్ష్మి, సుప్రభ, విష్ణువందన, కౌన్సిలర్ నాగులు, సుదర్శనమ్మ పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



తెలుగుదేశంపార్టీ కర్నాటక రాష్ట్ర కో-కన్వీనర్ రావి మోహన్‌చౌదరి బావమరిది, హైదరాబాద్‌లోని గాయత్రి విద్యాసంస్థల ఛైర్మెన్ పుట్టగుంట వెంకటరాధాకృష్ణమూర్తి - సంధ్యావాణిల కుమారుడు **అభిలేక్ - శ్వేత** (విజయవాడ వాస్తవ్యులు మొవ్వా రమేష్ - రంగలక్ష్మిల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 7వ తేదీ హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీ మొఘల్ గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



ముంగమూరు హరగోపాల్‌రెడ్డి - శివకుమారిల కుమారుడు **డా॥ సుధావిక్రమ్ - దేవిప్రియ** (ఒంగోలు వాస్తవ్యులు దుంపా శ్రీనివాసులురెడ్డి - లక్ష్మీదేవిల కుమార్తె)ల పెళ్లి ఈ నెల 4వ తేదీ ఒంగోలులోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనెలు.



సూర్య దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ గద్దగుంట సత్యనారాయణరెడ్డి - సుమతిల కుమార్తె **సాధనారెడ్డి - హరిరెడ్డి** (తడ మండలం మిట్టకండ్రిగ వాస్తవ్యులు మల్లిరెడ్డి సుధాకర్‌రెడ్డి - హైమావతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని టిటిడి కళ్యాణ మండపం నందు జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరులోని జనహిత వాత్సల్య అనాథాశ్రమంలో చదివిన **వాణి** పరిణయం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం ఎనిమిరెడ్డి వారిపల్లెకు చెందిన **బ్రహ్మారెడ్డి**తో ఈ నెల 6వ తేదీన వరుని స్వగృహం నందు జరిగింది. వధువు మేనమామ పాలగిరి బాలిరెడ్డి - ఆదిలక్ష్మి దంపతులు ఈ వివాహ వేడుకకు పెద్దలుగా వ్యవహరించారు. కొత్త వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

శ్రీను గల్పిక

# కృష్ణ పుష్కరాలలో ప్రపంచ దేశాధినేతలు

విజయవాడ కృష్ణా నది ఒడ్డున ఏపి సీఎం, హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు కార్యాలయం. పుష్కరాలకు ఎవరెవరిని ఆహ్వానించాలన్న దానిపై మంత్రులతో ఆయన మీటింగ్ పెట్టాడు. చంద్రబాబు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను మించిపోయేలా కృష్ణ పుష్కరాలను జరపాలి. భక్తులు కోట్లసంఖ్యలో రావాలి. అలాగే విఐపిలను సైతం పెద్దసంఖ్యలో ఆహ్వానించాలి. దీనికి మీ దగ్గరేమన్నా సలహాలుంటే ఇవ్వండని అడిగాడు. ముదురుదోమల మంత్రి, నైట్‌రైడర్ నారాయణ లేచి... సార్, పుష్కరాలకు భక్తులను పెంచడానికి నా దగ్గర ఓ ఐడియా వుంది. ప్రతి పుష్కర ఘాట్ వద్ద కళానికేతన్, సిఎంఆర్ షాపింగ్‌మాల్, శుభమస్తు వారి సహకారంతో డైలీ డ్రాలు పెడదాం, పుష్కరాలకొచ్చిన భక్తులకు కూపన్లు ఇస్తాం, రాత్రి వాటన్నింటిని ఓ డబ్బాలో వేసి లక్కీడిప్ తీస్తాం, డ్రాలో గెలుపొందిన వారికి పట్టుచీరలు, పట్టుపంచెలు బహుమతిగా ఇస్తామని ప్రకటిద్దాం. ఇలా 11రోజులు డైలీడ్రాలు జరుపుతాం. పుష్కరాల చివరి రోజున బంపర్ డ్రా క్రింద ప్రతి పుష్కరఘాట్ వద్ద బెంజ్‌కారు, మోటార్‌బైక్, టీవీ, ఫ్రిజ్ వంటి బహుమతులు పెట్టి గెలిచిన వారికి అవి అందజేస్తాం. ఈ స్కీంను అమలు చేస్తే మహిళా భక్తులు వస్తారు. ఇక మగవాళ్లు కూడా వారి వెనుక వచ్చినట్లు వస్తారు అని చెప్పాడు. నీ అయ్యోరి తెలివి తేటలు చూపించావ్ నారాయణ... శెభాష్ అంటూ చంద్రబాబు భుజం తట్టాడు. తర్వాత రావెల కిషోర్‌బాబు లేచి... సార్, పుష్కర ఘాట్ల వద్ద కృష్ణానదిలో కొన్ని బంగారు కాయిన్స్ వదిలేద్దాం. మనవాళ్లనే ఓ ఇద్దర్ని నదిలో మునగమని చెప్పి వారికి ఆ కాయిన్స్ దొరికేలా చేద్దాం. కృష్ణా నదిలో బంగారు నాణేలు దొరుకుతున్నాయని మీడియాలో ప్రచారం వస్తుంది. అప్పుడు మన రాష్ట్రం నుండే కాదు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఈశాన్య రాష్ట్రాల వారితో సహా భక్తులు పోటెత్తి వస్తారని చెప్పాడు. నీ ఐడియా కూడా బాగుందని రావెలను చంద్రబాబు మెచ్చుకున్నాడు. అప్పుడు యనమల రామకృష్ణుడు లేచి... సార్, మీ పుణ్యాన ఇప్పటివరకు పుష్కరాలకు జాతీయ ఇమేజ్ లభించింది. దీనిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలి. ఈ పుష్కరాలకు అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రిటన్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాధినేతలందరినీ ఆహ్వానిద్దాం... 'పుష్కరాలకు రండి... కృష్ణానదిలో మునగండి... చేసిన పాపాలను కడుక్కోండి'... ఇదే మన క్యాప్షన్. ఇలా చేస్తే మీ ఇమేజ్ కూడా ఇంటర్నేషనల్‌కు పాకుతుంది అని చెప్పాడు. చంద్రబాబు వెంటనే స్పందిస్తూ... మీరు చెప్పింది చాలా బాగుంది రామకృష్ణ... వీళ్లందరికీ ఇంటర్నెట్‌లో ఆహ్వానాలు పెట్టండి, అందరూ వస్తే పుష్కరాలలో మునగడంతో పాటు మనం కట్టే భూతల స్వర్గంలాంటి అమరావతి రాజధానిని కూడా చూసి తన్మయత్వం చెందుతారని చంద్రబాబు అన్నాడు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డి వుండి... అన్ని ప్రపంచ దేశాల ప్రజలను కూడా పుష్కరాలకు ఆహ్వానిస్తూ.. వెబ్‌సైట్‌లో ఆహ్వానం పెడదాం సార్, భక్తుల సంఖ్య లక్షలు దాటి కోట్లకు చేరుతుందన్నాడు. చంద్రబాబు దానికి కూడా ఓకే అన్నాడు.

★★★★★

విజయవాడలోని కృష్ణానది ఒడ్డున దుర్గా పుష్కర ఘాట్... "పుష్కర స్నానం చేయండి... పాపాలను కడుక్కోండి" అంటూ విఐపి మార్గం పొడవునా స్వాగత బ్యానర్లు కట్టారు. అప్పుడే అక్కడకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేరుకున్నారు. టీవీ 9-9-99 ప్రతినిధి బోండా భూషణం వారి వద్ద మైకు పెట్టి... మీరేం పాపం చేశారని పుష్కరాలలో మునగడానికి వచ్చారని ప్రశ్నించాడు. దానికి వెంకయ్య... మనిషన్నాక పాపాలు చేయకుండా వుంటారా, విభజన సమయంలో ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పాం, ఇప్పుడు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాం. ఎక్కడ చేసిన పాపం అక్కడే కడిగేసుకోవాలంటారు. అందుకే ఏపి విషయంలో చేసిన పాపాన్ని ఏపిలోనే కడిగేసుకోవాలని ఇక్కడికొచ్చాం అని చెప్పి ముందుకెళ్లాడు. ఆ తర్వాత అమెరికా మాజీఅధ్యక్షులు జార్జిబుష్, బిల్‌క్లింటన్‌లు వచ్చారు. బోండా భూషణం వారి ముందు కూడా మైక్ పెట్టాడు. జార్జిబుష్ మాట్లాడుతూ... నా హయాంలో అనవసరమైన యుద్ధాలు చేసి ఎంతోమంది అమాయకుల చావుకు కారణమయ్యాను. అప్పటి పాపాల వల్లే ఇప్పుడు ప్రపంచమంతా ఉగ్రవాదం పెరిగింది. ఆ పాపాలను కడిగేసుకుందామనే వచ్చాను అని చెప్పాడు. బిల్ క్లింటన్ అయితే... అధ్యక్షుడిగా వున్నప్పుడు తన భార్యకు తెలియకుండా కొన్ని తప్పులు చేసానని, వాటిని ప్రక్షాళన చేసుకునేందుకే ఇక్కడికి వచ్చానని చెప్పాడు. ఆ తర్వాత జర్మనీ ఛాన్సలర్ మోర్కెల్, రష్యా ప్రధాని పుతిన్, జపాన్ అధ్యక్షుడు షింజో అబే, చైనా ప్రధాని జింగ్ పింగ్‌లు కూడా పుష్కర ఘాట్ వద్దకు వచ్చి... తమ జీవితాలలో చేసిన పాపాలను కడుక్కోవడానికే ఇంత దూరం వచ్చినట్లు చెప్పారు. కొద్ది సేపటికి శ్రీలంక మాజీప్రధాని రాజపక్సే, భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌లు కూడా వచ్చి వీరితో చేరారు. చంద్రబాబు వాళ్లందరినీ తీసుకుని పుష్కరఘాట్ మెట్లు దిగి, నీళ్లలో అడుగు పెట్టబోయాడు... అంతే ఆ సమయంలో కృష్ణానదిలో నీళ్లు నెల్లూరులోని డైకస్‌రోడ్డు డ్రైనేజీ కాలువలో వున్న నీళ్లు మాదిరిగా నల్లగా కంపు కొడుతూ రాసాగాయి. మేం నీళ్లలో ఇంకా కాలు కూడా పెట్టలేదు... మా ఒంటి మీద వున్న మురికినే కాదు, మనసులో వున్న మురికి కూడా వదల్లేదు... నీళ్లు ఇంత నల్లగా ఎలా మారాయబ్బా అని చంద్రబాబు ఆలోచనలో పడగా... బిల్‌క్లింటన్ ఆ నీళ్లను చూసి సంతోషంతో వాట్ ఏ వండర్... యువర్ గ్రేట్ సంద్రబాబు... నేనింత వరకు వాటర్ వైట్‌గా వుండడం చూసా, స్కైబ్లూలో వుండడం చూసా... బ్లాక్‌వాటర్‌ను ఇప్పుడే చూస్తున్నా... రియల్లీ యువర్ గ్రేట్ అని పొగడసాగాడు. అంతలో అక్కడికి యనమల రామకృష్ణుడు పరుగెత్తుకుంటూ వచ్చి... సార్, కొంప మునిగింది అని అన్నాడు. దానికి చంద్రబాబు ఇక్కడ నీళ్లే లేక ఛస్తుంటే కొంపలెక్కడ మునుగుతాయని కోపంగా అడిగాడు. దానికి యనమల... అది కాదన్సార్ సంగతి, మనం ప్రపంచ దేశాధినేతల కోసం వెబ్‌సైట్‌లో ఆహ్వానపత్రిక పెట్టాం... పాపులకు బంపర్ ఆఫర్... 'పుష్కరాలలో మునగండి... పాపాలు కడుక్కోండి" అనే నినాదం కూడా రాసాం.. దానికి అంతర్జాతీయంగా విశేష స్పందన వచ్చింది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాపాలు చేసిన మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం, ఉగ్రవాదులు మసూద్ అజురీ, పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్, కుంభకోణాలు చేసి వేలకోట్లు మింగిన డి.రాజా, సురేష్ కల్మాడీ, కనిమొళి, ఇంకా ఇంటర్నేషనల్ స్మగ్లర్లు, కిల్లర్లు, మాఫియాడాన్‌లు అమరావతి ఘాట్ వద్ద కృష్ణలో మునుగుతున్నారు. వారి పాపాలను కృష్ణలో కడిగేసుకుంటుండడంతో నీళ్లు నల్లగా మారి డ్రైనేజీ వాటర్‌లా తయారయ్యాయి... వీళ్ల దెబ్బకు సాధారణ భక్తులు పుష్కరఘాట్‌ల వద్దకు రావడం లేదు. కృష్ణకు భారీ వరదలొస్తేగాని ఈ డ్రైనేజీ నీళ్లు సముద్రానికి పోవు. ఈ నీళ్లలో జనం ఇక పుష్కర స్నానం చేయలేరని చెప్పాడు. ఎంత పని చేసావు యనమల... అంటూ చంద్రబాబు దిగాలు పడిపోయాడు.

---

### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆదాయానికి ధీటుగా ఖర్చులుంటాయి. వ్యాపార అవకాశాలు తృప్తికరంగా ఉండవు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమ పడవలసి వస్తుంది. కుటుంబ విషయాలను జాగ్రత్తగా నిర్వహించండి. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఉద్యోగులు తమ పైఅధికారులతో జాగ్రత్తగా మెలగాలి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

చేపట్టిన పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. సమావేశాలలో మీ సూచనలు, సలహాలకు ఆమోదం లభిస్తుంది. బిడ్డల విద్యా వృద్ధి, శుభకార్యాల నిర్ణయం జరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అను కూలత కలదు. బంధుత్వాలు, పరిచయాలు విస్తరించ గలవు. కాంట్రాక్టర్లు, రియల్‌ఎస్టేట్ రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

సొంత నిర్ణయాలతో అనుకున్న పనులు జరుపుకుంటారు. అవసరాలకు ఋణం చేయడం కాని, ఋణం చేసియున్న వారు కొంత తీర్చడం గాని జరుగుతుంది. క్రయ విక్రయాలు ఖరారు చేస్తారు. అనవసర వ్యవహారాలలో తల దూర్చవద్దు. వృత్తి వ్యాపారాలు ఓ మోస్తరుగా జరిగి, ఆదాయం షుమారుగా ఉంటుంది. ఉద్యోగులకు పదోన్నతి, అదనపు బాధ్యతలుంటాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబ ఆర్థిక సమస్యసలు సర్దుబాటు కాగలవు. మంచి వ్యాపార అవకాశాలు, వృత్తి పరంగా అభివృద్ధి లభించగలవు. అనుకున్న పనులు పట్టుదలతో ఏదో విధంగా పూర్తి చేయగలరు. ఉద్యోగులకు ప్రభుత్వ బహుమతులు, అధికారుల ఆదరణ ఉంటుంది. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన వస్తువులు కొనడం, దైవక్షేత్ర తీర్థములను సేవించుతారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ప్రభుత్వ అనుమతులు, కొత్త ఋణాలు అందుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. దూర ప్రయాణాలు, పుణ్యక్షేత్ర సందర్శన ఉంటుంది. అభిప్రాయ భేదాలు, వివాదాలు సర్దుబాటు కాగలవు. కుటుంబ సౌఖ్యం, శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. కోర్టు కేసులు అనుకూలం కావడం జరుగుతుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలలో ప్రతిభ చూపి, అనుభవం సంపాదిస్తారు. వ్యాపార పరంగా మంచి అవకాశాలు లభించి ఆదాయవృద్ధి కలదు. పొదుపు పథకాలు లాభిస్తాయి. ఉద్యోగులు తమ బాధ్యతలు విజయవంతంగా పూర్తి చేస్తారు. సత్కర్మలలో పాల్గొంటారు. దూర ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ సంబంధమైన ప్రయోజనాలు రావడం ఆలస్యం కాగలవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 19.8.2016 నుండి

తేది. 25.8.2016 వరకు

ఈ వారం సింహంలో రవి రాహుశుక్రులు, కన్యలో బుధ గురువులు, వృశ్చికంలో శని కుజుడు, కుంభంలో కేతువు, కుంభ మీన మేష వృషభంలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 23 మంగళవారము కృష్ణానదీ పుష్కరాలు సమాప్తము.

తేది 25 కృష్ణాష్టమి పర్వదినము.

**ముహూర్తము:**

తేది 22 సోమవారము ఉదయం గంట 3.08 నుండి గంట 5.14 వరకు కర్కాటక లగ్నమున గృహారంభ, గృహప్రవేశములు.

**శ్రావణ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | పాడ్యమి | ప॥ గం.2.0వ॥ |
| తేది. 20 | శని | విదియ | ప॥ గం.12.26వ॥ |
| తేది. 21 | ఆది | తదియ | ఉ॥ గం.10.30వ॥ |
| తేది. 22 | సోమ | చతుర్థి | ఉ॥ గం. 8.24వ॥ |
| తేది. 23 | మంగళ | పంచమి | ఉ॥ గం. 6.10వ॥ |
| | పిదప | షష్ఠి | రా॥ గం. 3.40వ॥ |
| తేది. 24 | బుధ | సప్తమి | రా॥ గం.1.08వ॥ |
| తేది. 25 | గురు | అష్టమి | రా॥ గం.10.44వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులు పెరిగి, ఆర్థికంగా స్వల్ప ఇబ్బందులుంటాయి. వ్యాపార వర్గాలకు అనుకున్నంత అవకాశాలు దొరకక పోవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యం. పుణ్య కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త వహించాలి. బిడ్డల వల్ల చిన్న సమస్య కలుగవచ్చును. కోర్టు వ్యవహారాలు కొంత ఇబ్బంది కలిగించవచ్చును.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొత్త ఆర్థిక ప్రయత్నాలకు ప్రారంభం జరగవచ్చును. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల, ఆదాయం బాగుంటుంది. దురుసు ప్రవర్తన, తొందరపాటు మాటలు తగ్గించుకొనవలసి ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. దైవ కార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు పురస్కారాలు, కార్యసామర్థ్యము బాగుంటుంది. విద్యావృద్ధి బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కావడం, దైవకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అనుకోని ఖర్చులు పైనబడగలవు. అవసరానికి ఋణం కాని, దాచుకొన్నదిగాని తీసి ఖర్చు పెట్టవలసి వస్తుంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. కుటుంబంలో చిన్న విభేదాలు చోటుచేసికొనవచ్చును.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన పనులందు అప్రమత్తంగా మెలగాలి. గృహ వస్తు వాహన రిపేర్లుండగలవు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. కుటుంబసభ్యులొకరికి గాని, బంధు వర్గంలోగాని అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో మీకు జాగ్రత్త అవసరం. ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పనులందు టెన్షన్ ఉంటుంది. ఆలోచనలు చేసి జాగ్రత్తగా పనులు చేయాలి. వ్యాపారులకు సామాన్యంగా క్రయవిక్రయాలు జరిగి, సామాన్య ఆదాయం ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి ఆర్థిక స్థితి బాగుంటుంది. అయితే ఈ రాశి వారికి కొన్ని ఆకస్మిక ఖర్చులుంటాయి. స్టాకిస్టులు, కాంట్రాక్టర్లకు బాగుంటుంది. బంధువర్గంతో విభేదాలు లేకుండా చూచుకొనాలి.


### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

రావలసిన బాకీలు ప్రయత్నంతో రాబట్టుకొనాలి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి అవకాశాలు పెరిగి ఆదాయవృద్ధి ఉంటుంది. ప్రభుత్వపరంగా వ్యాపారులకు ఉద్యోగులకు వత్తిడి పెరుగుతుంది. దైవ కార్యాలలో పాల్గొంటారు. కొత్త కొనుగోళ్లు, స్థిరాస్తుల క్రయవిక్రయాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. ఇతరుల వల్ల స్వల్పంగా మాటలు పడవలసి రావచ్చును.

# కల్యాణ వైభవం...!



దువ్వూరు శ్రీధర్‌రెడ్డి - శ్రీలతల కుమార్తె **వినూక - సనత్** (సంగం మండలం దువ్వూరు వాస్తవ్యులు కూరపాటి జగన్మోహన్‌రెడ్డి - సుఖవేణిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 14వ తేదీ కోవూరులోని అనపల్లి కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరులోని ప్రముఖ వైద్యులు డా॥ టి.వై.కృష్ణ - రోహిణిల కుమార్తె **విమల దీప్తి - వరుణ్‌కృష్ణ** (కృష్ణా జిల్లా జయంతి గ్రామ వాస్తవ్యులు కొణతం వెంకటేశ్వరరావు - విజయలక్ష్మిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 7వ తేదీ నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# ఉపాధి కల్పనలో పోర్టు సేవలు భేష్



ప్రసంగిస్తున్న సిఇఓ అనిల్





అలరించిన కెపిసిఎల్ విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

యువతకు నైపుణ్యతలో శిక్షణనిచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో కృష్ణపట్నం పోర్టు సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం కృష్ణపట్నం పోర్టులో జరిగిన 70వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కృష్ణపట్నం పోర్టు చేస్తున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని అభినందించారు. నైపుణ్యం కలిగిన యువతకు పోర్టులో ఉపాధి అవకాశాలున్నాయని, యువతలో నైపుణ్యం పెంచడానికి ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా కృషి చేస్తుందన్నారు.

కృష్ణపట్నం పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్ మాట్లాడుతూ యువతకు విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో ప్రోత్సాహాన్నందించేందుకు పోర్టు ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో సిఓఓ చక్రవర్తి, పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్, కెఎస్ఎస్‌పిఎల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 18వ తేదీన రక్షా బంధన్ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి రాఖీ కడుతున్న జడ్పీ వైస్‌ఛైర్మన్ పి.శిరీషా

# పచ్చదనంతో కళకళలాడాలి

కావలి నియోజకవర్గం పచ్చదనంతో కళకళలాడేలా ప్రతిఒక్కరూ.. ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, రూరల్ మండల తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మస్తాన్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వయంగా పర్యవేక్షిస్తూ కృష్ణా పుష్కరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా కృష్ణానదికి అను సంధానం చేయడం చారిత్రాత్మక విషయమన్నారు. కృష్ణా పుష్కరాలలో భక్తులకు సౌకర్యాలు కల్పించి రాష్ట్ర చరిత్రలో మిగిలి పోయేలా అన్ని హంగులతో రూపకల్పన చేయడం ఒక చంద్రబాబుకే సాధ్యమన్నారు. రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావుకు ఎమ్మెల్యే ప్రోటోకాల్ వర్తింపచేస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం అభినందనీయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, రూరల్ మండల అధ్యక్షుడు పాలడుగుల రంగారావు రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, ఎమ్‌పీపీ పత్రి మహేశ్వరి, నాయుడు రాంప్రసాద్, అమరా యాదగిరి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు

# హామీలను అమలుచేయాలి



వార్డు సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 40 వార్డు అడివిరాజు పాలెంలో గడప గడపకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, హోదా కోసం చంద్రబాబునాయుడు పోరాటం చేయడంలేదని విమర్శించారు. అవినీతి సొమ్ముతో తెలంగాణాలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే కేసులో ఇరుక్కున్న చంద్రబాబు ఏమీ చేయలేని పరిస్థితులలో కేసునుండి బయట పడేందుకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేగా రామయ్య, కనుమర్లపూడి వెంకటనారాయణ, మందా శ్రీనివాసులు, ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, పేరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## కావలి కబుర్లు

# మొక్కలు నాటి.. వాటిని సంరక్షించండి

ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. ఈ నెల 13న స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలో సమతా భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న అలేఖ్య మొక్కలు నాటి మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రజలు ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. సకాలంలో వర్షాలు పడాలన్నా.. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నా.. మొక్కలు పెంచడం ఎంతో అవసరమన్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చుకోవాలంటే మొక్కలను ఎక్కువ సంఖ్యలో పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు, పి.ఎల్.ప్రభుదాసు, సంస్థ వ్యవస్థాపకులు మురళి, సెక్రటరీ ఆశాజ్యోతి, చేవూరు రవీంద్ర, గద్దె అమరనాథ్, చిన్నబాబు, బ్రహ్మయ్య, లక్ష్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రమ్మ కాలనీలో మొక్కలు నాటిన అలేఖ్య

# వాత్సల్యకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వస్తువులు




నెల్లూరుజిల్లా మనుబోలు మండలం కాగితాలపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.ఆర్.అరుణాచలం, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.రమణమూర్తి, సీనియర్ ఇంజనీరు ఐ.శ్రీకృష్ణ బుధవారం నెల్లూరులోని జనహిత-వాత్సల్య నిరాధార బాలబాలికల ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జనహిత-వాత్సల్యకు 50కుర్చీలు, వెయ్యి లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ ట్యాంకును జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కె.ఆర్.అరుణాచలం మాట్లాడుతూ వాత్సల్యలో గల పిల్లలు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం ఆనందకర విషయమని, వాత్సల్యకు ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత – వాత్సల్య సంఘటనా కార్యదర్శి జి.వి.సాంబశివరావు, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

# మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

## - వి.యస్.యు రిజిస్ట్రార్



మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహోయజ్ఞంలా చేపట్టాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.ఆర్.శివశంకర్ అన్నారు. ఈ నెల 13వ తేదీన నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో వనం-మనం కార్యక్రమం రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రిన్సిపల్ పుల్లయ్య వ్యవహరించారు. సెక్రెటరీ సిఇఓ సి.సుబ్రహ్మణ్యం, కె.మురళీమోహన్‌రావు, రాచపాళెం రఘు, ఆచార్య ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష రక్షణకు

# యువత నడుంకట్టాలి

తెలుగు భాషను రక్షించుకోవాలంటే యువతరం నడుం కట్టాలని అధికార భాషా సంఘం అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలు వర్ధమాన సమాజం మిద్దెపైన కృష్ణా పుష్కర కవితోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవహరించిన హరికృష్ణ మాట్లాడుతూ తెలుగుభాషను అభివృద్ధి పరచేందుకు అన్ని జిల్లాల్లో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ కృష్ణ పుష్కర కవితోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత పోలూరి హనుమజ్జానకీ శర్మ రచించిన 'కృష్ణం వందే పుష్కరం' గ్రంథం ఆవిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథులుగా మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు. ఆచార్య ఆదిత్య, బాలసాహితీ వేత్త బెల్లంకొండ నాగేశ్వరరావులను సత్కరించారు. కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరిని దుశ్శాలువ, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

# తగ్గిన జనం

(మొదటి పేజీ తరువాయి)

సాంప్రదాయ బద్ధంగా ఎవరి పద్ధతుల్లో వాళ్లు పుష్కరాలు చేసుకుంటే వంద కోట్లు ఖర్చయితే, అదే పుష్కరాలను చంద్రబాబు చేస్తే 2వేల కోట్లవుతున్నాయి. ఖరీదైన ఈవెంట్ మేనేజ్‌మెంట్ అన్నమాట. అయితే ఖరీదుకు తగ్గట్టుగా ఊరంతా ధగధగ మనే లైటింగ్, లేజర్‌షోలు వంటి బిల్డప్‌లు బాగానే ఉంటాయి.

పుష్కరాలను బ్రహ్మాండంగా చేస్తే చాలు... నా పరిపాలన అద్భుతంగా ఉన్నట్లేనని భ్రమలో చంద్రబాబు ఉన్నట్లుంది. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పుష్కరాలకు ఆయన ఏర్పాట్లు చేసాడు. గత ఏడాది గోదావరి పుష్కరాలకు 2వేల కోట్లు తగలేసాడు. ఏర్పాట్లు ఘనంగా చేసాడు కాని, పుష్కరాలకు ఇంత ఖర్చేంటనే ప్రశ్నలకు మాత్రం ఇంతవరకు సమాధానం లేదు. 200కోట్ల ఖర్చుతో పోయేదానిని 2వేల కోట్లకు టెండర్ పెట్టాడు. ఇప్పుడు కృష్ణ పుష్కరాలకు కూడా 1400కోట్ల దాకా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. గోదావరి పుష్కరాలప్పుడే చంద్రబాబు 12రోజుల పాటు రాజమండ్రిలో వున్నాడు. ఇప్పుడు విజయవాడలో పుష్కరాలు. సీఎం క్యాంప్ ఆఫీసు అక్కడే! ఇక ఆయనకు రెండో పని లేదు. ఉదయం, రాత్రి ఘాట్ల వద్దే! హారతి ముగిసే దాకా ఉండడం, అక్కడే భక్తుల నుద్దేశించి స్పీచ్ దంచడం... ఆయన 12 ఏళ్లకు ఒకసారి కాదు, సంవత్సరానికి ఒకసారి పుష్కరాలు వచ్చినా బాగుండను కుంటున్నట్లుంది.

అయితే చంద్రబాబు హంగామాకు తగ్గట్లుగా ఈసారి కృష్ణ పుష్కరాల సందడి లేదు. కోట్లలో జనం వస్తారని చంద్రబాబు అంచనాలు వేసాడు కాని, అంచనాలకు తగ్గట్లుగా భక్తులు రావడం లేదు. గోదావరి పుష్కరాల మొదటి రోజే జరిగిన తొక్కిసలాటలో 27మంది చనిపోవడం తెలిసిందే! ఆ ప్రభావం కృష్ణ పుష్కరాలపై పడ్డట్లుంది. పుష్కరాలకంటూ జనం వేలం వెర్రిగా పరుగులు తీయడం లేదు. గోదావరి పుష్కరాలప్పుడు ప్రభుత్వం ప్రజల్లో ఒక ఫోబియాను సృష్టించింది. ఇది 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాపుష్కరాలని, ఇందులో మునగకపోతే పాపం మూట గట్టుకుని పోతారన్నట్లు ప్రచారం దంచింది. కృష్ణ పుష్కరాల్లో ఆ ఫోబియా తగ్గింది. చంద్రబాబు వేయించిన సెట్టింగ్‌లను చూసేందుకు కాకుండా సాంప్రదాయ పద్ధతిలో పుష్కర స్నానం కోసం వెళ్ళే వాళ్లే వెళ్తున్నారు.

# నెల్లూరు 'దేశం'?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అధ్యక్షుడిగా వుండాలి. ఈ కోణంలో చూస్తే ఆనం రామనారాయణ రెడ్డి సరిపోతాడు. జిల్లాలో 10అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, కనీసం 5 నియోజకవర్గాల్లో ఆంతో ఇంతో వారి ప్రాబల్యం వుంది. ప్రతి నియోజకవర్గంలోనూ అన్ని పార్టీల వారితో సంబంధాలున్నాయి. రాజకీయ అనుభవం చాలానే వుంది. ఇక ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో దిట్ట. ఆయన నాయకత్వంలో అయితే 'రెడ్డి' వర్గాన్ని కొంత వరకు వైకాపా వైపు పోకుండా పార్టీలోనే నిలబెట్టుకునేందుకు అవకాశముంటుంది. అన్ని వైపుల నుండి ఆలోచించే జిల్లా పార్టీ నాయకత్వాన్ని త్వరలోనే ఆనం చేతుల్లో పెట్టొచ్చని సమాచారం.

# చీకట్లో రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

మరిప్పుడు చంద్రబాబు సొంత బ్రాండ్ లేదు. సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫాల మూలంగా ఓట్లు రావు. పుష్కరాలు బ్రహ్మాండంగా చేసాడని చెప్పి జనం ఓట్లేయరు. వై.యస్. హయాంలో మెట్ట భూములు సెజ్‌లుగా మారి అభివృద్ధికి పునాదులు పడితే, చంద్రబాబు పాలనలో బంగారం పండించే భూములు రాజధాని పేరుతో, సెజ్‌ల పేరుతో నాశనమవుతున్నాయి. రైతులు ప్రభుత్వానికి బద్ధశత్రువులవుతున్నారు. ఇక ఇసుక, మద్యం వ్యాపారుల సంగతి సరేసరి! రియల్ ఎస్టేట్ వ్యాపారమైతే రాష్ట్రంలో సచ్చిపోయింది. దీని ప్రభావం కూడా ఇతర వ్యాపార రంగాలపై బలంగానే వుంది.

చంద్రబాబు సీఎం అయిన ఈ రెండున్నరేళ్ళ కాలంలో రాష్ట్రం ఫలానా రంగంలో అభివృద్ధి చెందిందనే పరిస్థితి లేదు. వ్యవసాయం అంతంత మాత్రంగా వుంది. పారిశ్రామికంగా ఒక అడుగు ముందుకేస్తే నాలుగడుగులు వెనక్కి పడుతున్నాయి. చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ వచ్చింది లేదు. కేంద్రం నుండి అంతంత మాత్రం నిధులొస్తున్నాయి. పోలవరం నత్త నడకన వుంది. కొత్తగా ఉద్యోగాలు లేవు. రాజధాని మూలంగా రియల్ ఎస్టేట్ స్తబ్దుగా వుంది. రాష్ట్రంలో ఏ రంగంలోని ప్రజల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. చంద్రబాబు పరిపాలన ఇదే విధంగా కొనసాగితే రాష్ట్రం చీకట్లోకి పోతుందనడంలో సందేహం లేదు.

# మన స్వాతంత్ర్యవీరులు

(2వ పేజీ తరువాయి)

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 44 | చెంచురామయ్య పి. | నారాయణరెడ్డిపేట |
| 45 | చెంచురెడ్డి సురే | కావలి తాలూకా |
| 46 | చెంచుసుబ్బారెడ్డి ఆనం | నెల్లూరు |
| 47 | చెంగయ్య పుదుచ్చేరి | వెంకటగిరి |
| 48 | చెన్నకృష్ణయ్య చింతలపల్లి | నావూరు, ఆత్మకూరు తాలూకా |
| 49 | చిదంబరం మహంకాళి | బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు తాలూకా |
| 50 | చిన్న కొండయ్య గంగా (జిసి కొండయ్య) | వాశిలి, ఆత్మకూరు తాలూకా |
| 51 | చిన్న పిచ్చిరెడ్డి చేవూరు | గంగపట్నం, నెల్లూరు తాలూకా |
| 52 | చిన్నరాఘవులు గుండు | గోగులపల్లి, కోవూరు తాలూకా |
| 53 | చిన్నసుబ్బయ్య మాదరపాక | సూళ్ళూరుపేట |
| 54 | చిన్న వెంకటసుబ్బారెడ్డి అన్నంరెడ్డి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 55 | చిన్నయ్య | బంగారుపేట వెంకటగిరి |
| 56 | చిన్నయ్య కరాబత్తిని | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 57 | దశరథరామిరెడ్డి రేబాల | కావలి |
| 58 | దశరథరామిరెడ్డి నెల్లూరు | కాగొల్లు కోవూరు తాలూకా |
| 59 | దశరథరామిరెడ్డి పాలిచెర్ల | అలగానిపాడు కోవూరు తాలూకా |
| 60 | దశయ్య మాచర్ల | సూళ్ళూరుపేట |
| 61 | ధర్మారెడ్డి చవనం | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 62 | దొరైస్వామి.ఎస్ | నెల్లూరుజిల్లా |
| 63 | గణపతి టిఎస్ | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 64 | గంగాధరరావు అమంచర్ల | దేవరాయపల్లి, ఆత్మకూరు తాలూకా |
| 65 | గంగయ్య వేల్పు | వెంకటగిరి |
| 66 | గోపాలకృష్ణయ్య తిప్పావఝుల | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 67 | గోపాలరావు అమంచర్ల | కావలి |
| 68 | గోపాలరావు ముత్తరాజు | నెల్లూరు |
| 69 | గోపాలరెడ్డి బెజవాడ | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 70 | గోవిందాచారి సింహాద్రి | నెల్లూరు |
| 71 | గోవిందస్వామి ఆవుల | గూడూరు తాలూకా |
| 72 | గోవిందు లవిశెట్టి | సూళ్ళూరుపేట |
| 73 | గోవిందు మిరియాల | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 74 | గుప్త ఎన్ ఆర్ | నెల్లూరుజిల్లా |
| 75 | గురవయ్య ముక్కంటి | వెంకటగిరి |
| 76 | గురునాథం చీళ్ళ | వెంకటగిరి |
| 77 | హనుమంతరావు మానేపల్లి | నెల్లూరు |
| 78 | హనుమంతరావు మోచర్ల | కోటపోలూరు సూళ్ళూరుపేట |
| 79 | హనుమారెడ్డి గండవరపు | నెల్లూరుజిల్లా |
| 80 | జాకబ్ పర్రి | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 81 | జగన్నాథం చుండి | నెల్లూరు |
| 82 | జగన్నాథం పోతిముత్యాలు | వెంకటగిరి |
| 83 | కాళయ్యశెట్టి గాదిరాజు | కోవూరు |
| 84 | కళ్యాణరావు కటికనేని | వెంకటగిరి |
| 85 | కామమ్మ ముత్తుకూరు | నెల్లూరు |
| 86 | కామేశ్వరరావు ఎర్రమిల్లి | గూడూరు |
| 87 | కనకమ్మ పొణకా | నెల్లూరు |
| 88 | కాంతారావు ఏ | వెంకటగిరి |
| 89 | కస్తూరిరెడ్డి కట్టా | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 90 | కోదండరామరెడ్డి యర్రంరెడ్డి | కొత్తూరు నెల్లూరు తాలూకా |
| 91 | కోదండరామిరెడ్డి వంగల్లు | తోటపల్లి గూడూరు తాలూకా |
| 92 | కోదండరామిరెడ్డి వర్ధిరెడ్డి | మైపాడు నెల్లూరు తాలూకా |
| 93 | కొండయ్య | జయంపు వెంకటగిరి తాలూకా |
| 94 | కొండయ్య బుర్రా | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 95 | కొండయ్య చెక్కా | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 96 | కొండయ్య.డి | వింజమూరు, ఉదయగిరి తాలూకా |
| 97 | కొండయ్య తన్నీరు | కావలి తాలూకా |
| 98 | కోటయ్య ఆకురాతి | ఇనమడుగు, కోవూరు తాలూకా |
| 99 | కోటయ్య చీకిరి | సర్వేపల్లి, నెల్లూరు తాలూకా |
| 100 | కోటయ్య శెట్టిపల్లి | నాయుడుపేట, సూళ్లూరుపేట తాలూకా |
| 101 | కోటయ్య టి | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 102 | కోటేశ్వరరావు సి | కావలి తాలూకా |
| 103 | కృష్ణారావు ఇంటి | సూళ్ళూరుపేట |
| 104 | కృష్ణారావు ఖండవల్లి | నెల్లూరు |
| 105 | కృష్ణారెడ్డి అన్నంరెడ్డి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 106 | కృష్ణారెడ్డి టి | నెల్లూరు తాలూకా |
| 107 | కృష్ణయ్య | అల్లూరు కోవూరు తాలూకా |
| 108 | కృష్ణయ్య మురహరిశెట్టి | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 109 | కృష్ణయ్యచెట్టి రెంటాల | పల్లిపాడు నెల్లూరు తాలూకా |

(మరిన్ని పేర్లు వచ్చేవారం)




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com